RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 365 మేడ్చల్ మల్కాజ్‌గిరి 25 జనవరి 2025 శనివారం పేజీలు : 4

## మహారాష్ట్రలో భారీ పేలుడు: ఐదుగురి మృతి

మహారాష్ట్రలో భారీ పేలుడు సంభవించింది. భండార జిల్లాలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో పేలుడు జరిగింది. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు దాటికి ఫ్యాక్టరీ పైకప్పు కుప్పకూలిపోయింది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

నాగ్ పూర్ డిఫెన్స్ పిఆర్వో ఈ పేలుడు ఘటనపై అధికారిక ప్రకటన చేశారు. పేలుడుకు గల కారణాలపై విచారణ జరుపుతున్నట్లు చెప్పారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ కావడంతో తీవ్రత ఎక్కువగా ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో ఫ్యాక్టరీలోచాలా మంది చిక్కుకుపో యారు. అందులో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు.




# కేంద్ర బడ్జెట్ పై పెరుగుతున్న సామాన్యుల అంచనాలు!

## ధరలు పెరిగేటివి, తగ్గేటివి ఇవేనా?

ఎప్పటిలాగే ఈసారి కూడా నరేంద్ర మోడీ 2.0 ప్రభుత్వంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న సంగతి మీకు తెలిసిందే. అయితే ఈ బడ్జెట్ పై ఇప్పటికే అంచనాలు, ఊహాగానాలు పెరిగాయి. అలాగే కేంద్ర మంత్రి వర్గానికి కొన్ని పరిశ్రమలు సిఫార్సులు కూడా చేసాయి. బడ్జెట్ అనగానే సామాన్యులు ఆశించేది కొత్త పథకాలు, అధిక కేటాయింపులు ఇంకా ధరల పెంపు లేదా ధరల తగ్గింపు. అయితే 2025-26 బడ్జెట్ పై ఏయే వస్తువులపై పన్ను పెరిగే అవకాశం ఉంది.. ఏయే వస్తువులపై తగ్గే అవకాశం ఉందనే సమాచారం తాజాగా బయటకు వచ్చింది. దీని ప్రకారం వాషింగ్ మెషీన్, డిష్ వాషర్, మెడికల్ ఎక్విప్ మెంట్ వంటి ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ధరలు పెరిగే అవకాశం ఉందని సమాచారం. రాబోయే యూనియన్ బడ్జెట్‌లో దేశీయ తయారీదారులకు ప్రయోజనం చేకూర్చడానికి ఇంకా దిగుమతులను తగ్గించడానికి కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ నుండి వైద్య పరికరాల వరకు దిగుమతి చేసుకున్న పూర్తిగా తయారు చేసిన పరికరాలపై కేంద్ర ప్రభుత్వం సుంకాలను పెంచుతుందని విస్తృతంగా భావిస్తున్నారు.

దీంతో ఈ ఉత్పత్తుల ధరలు పెరుగుతాయి. అయితే వాషింగ్ మెషిన్, డిష్ వాషర్ వంటి ఎలక్ట్రానిక్ ఉపకరణాల ధరలు పెంపు ఏ మాత్రం ఉండొచ్చు అనేది స్పష్టంగా లేనప్పటికీ, ప్రస్తుతం దిగుమతి చేసుకున్న ఎలక్ట్రానిక్ ఉపకరణాలపై ప్రాథమిక సుంకం 10 శాతంగా ఉంది. కేంద్ర బడ్జెట్‌లో దిగుమతి చేసుకున్న వైద్య పరికరాలపై సుంకం పెంచే అవకాశం ఉందని సమాచారం. వీటిలో ముఖ్యంగా వియత్నాం నుండి దిగుమతి చేసుకున్న BP మెషీన్ అండ్ ఆక్సిమేట్ వంటి వైద్య పరికరాల ధరలను పెంచవచ్చు. కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ ఇంకా మెడికల్ పరికరాలపై దిగుమతి సుంకాన్ని పెంచుతున్నప్పుడు, కేంద్ర ప్రభుత్వం తయారీ పరికరాలలో ఉపయోగించే భాగాలపై దిగుమతి సుంకాన్ని తగ్గించే అవకాశం ఉంది. దీని వల్ల విడిభాగాల ధరను తగ్గే అవకాశం ఉంది. దేశీయ తయారీదారుల ప్రయోజనాల కోసం అలాగే వాటి ఎగుమతి పోటీతత్వాన్ని పెంచడం కోసం ఈ భాగాలపై దిగుమతి సుంకాన్ని తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యతో దేశీయ తయారీదారులు లాభపడతారని భావిస్తున్నారు. అయితే, దిగుమతి సుంకం ఎంత తగ్గుతుందనే దానిపై ఖచ్చితమైన సమాచారం లేదు. మరోవైపు కొత్త ట్యాక్స్ రిటర్న్ ఫైలింగ్ విధానంలో పలు సమూల మార్పులు తీసుకురానున్నట్టు సమాచారం.

# తెలంగాణలో టీడీపీ పొలిటికల్ సెగలు.. బీఆర్ఎస్ లో అలజడి?






హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ గురించి వినిపిస్తున్న ఊహాగానాలు చర్చనీయాంశంగా మారాయి. బీఆర్ఎస్ అధికారం కోల్పోయిన తర్వాత తలసాని రాజకీయంగా తగ్గిపోయినట్టే కనిపిస్తున్నారు. ఇటీవల మీడియాలో పెద్దగా చురుగ్గా కనిపించకపోవడం, పార్టీ కార్యక్రమాల్లో ఆమడదూరంగా ఉండటం గమనార్హం. దీంతో ఆయన మరో పార్టీ వైపు చూస్తున్నారన్న పుకార్లు మరింత బలపడుతున్నా యి. తలసాని గతంలో టీడీపీ ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించిన సంగతి తెలిసిందే. కానీ, తర్వాత బీఆర్ఎస్‌లో చేరి కీలక పదవులు ఆక్రమించారు. అయితే, ఇప్పుడు మళ్లీ టీడీపీ వైపు ఆయన చూపు మళ్లినట్టుగా తెలుస్తోంది. టీడీపీ అధికారం ఏపీలో సురక్షితంగా ఉండడం, తెలంగాణలో పార్టీని విస్తరించే యోచనలో చంద్రబాబు ఉండటం ఈ విషయానికి మరింత బలాన్ని ఇస్తున్నాయి. తలసాని టీడీపీ చెంతకు చేరితే, అక్కడి నుంచి తెలంగాణ టీడీపీ పగ్గాలు తలసాని చేతుల్లోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూడా ఈ పరిణామాలను గమనిస్తున్నారని సమాచారం. తలసాని పార్టీ మారితే బీఆర్ఎస్‌పై ఏమాత్రం ప్రభావం పడుతుందనే విషయంపై కేసీఆర్ దృష్టి పెట్టినట్టుగా రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఒకవేళ తలసాని వెళ్లిపోతే, బీసీ సామాజిక వర్గానికి చెందిన నేత కావడంతో అది బీఆర్ఎస్‌కు కొంతంత మైనస్ అవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తలసాని శ్రీనివాస్ యాదవ్ నిజంగా పార్టీ మారుతారా లేదా అన్నది మరికొన్ని రోజుల్లో స్పష్టమవుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కానీ, ప్రస్తుతం ఈ ఊహాగానాలు తెలంగాణ రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిస్తున్నాయి. తలసాని నిర్ణయం ఎలా ఉన్నా, అది రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపుగా నిలిచే అవకాశం ఉందని అనిపిస్తోంది.




హైదరాబాద్ మేయర్, డిప్యూటీ మేయర్ పై అవిశ్వాస తీర్మానంపై జోరుగా చర్చ జరుగుతోంది. రెండ్రోజుల క్రితం మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ ఇంట్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లతో అవిశ్వాస తీర్మానంపై చర్చించారు. జీహెచ్ఎంసీ యాక్ట్ ప్రకారం నాలుగేళ్లు పూర్తయిన తర్వాతనే అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలి. ఫిబ్రవరి 20కు మేయర్, డిప్యూటీ మేయర్ లు ఎన్నిక జరిగి నాలుగేళ్లు అవుతుంది. మేయర్ పై అవిశ్వాస తీర్మానం పెడుతామంటూ జనవరి 22న మరోసారి ప్రకటించారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. జీహెచ్ఎంసీ యాక్ట్ ప్రకారం నాలుగేళ్లు పూర్తయిన తర్వాతనే మేయర్ పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలి. ఫిబ్రవరి 10 కి మేయర్, డిప్యూటీ మేయర్ లు ఎన్నికై నాలుగేళ్లు. ప్రస్తుతం కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో మెంబర్స్ కలిసి మొత్తం 196 మంది ఉన్నారు. అవిశ్వాసం పెట్టాలంటే సగం మంది సభ్యుల మద్దతు ఉండాలి... అవిశ్వాసం నెగ్గాలంటే 2/3 మెంబెర్స్ మద్దతు ఉండాలి. బీఆర్ఎస్ కు జీహెచ్ఎంసీలో 42 మంది కార్పొరేటర్లు, 29 ఎక్స్ అఫీషియో లు కలిపి మొత్తం 71 సంఖ్యా బలం ఉంది. అవిశ్వాసం ప్రవేశపెట్టాలన్నా..బీఆర్ఎస్ కు సంఖ్యా బలం లేదు. అయితే బీజేపీ తమకు సపోర్ట్ చేస్తుందని బీఆర్ఎస్ కార్పొరేటర్లు భావిస్తున్నారు. ప్రస్తుతం బీజేపీకి 39 మంది కార్పొరేటర్లు, 6 ఎక్స్ అఫిషియో మెంబర్స్ కలిపి మొత్తం 45 మంది సంఖ్యా బలం ఉంది. అవిశ్వాసం నెగ్గాలంటే 131 కావాలి.. బీఆర్ఎస్, బీజేపీ కలిసినా 116 మాత్రమే.. ఇంకా 15మంది సభ్యుల మద్దతు కావాలి. 41 కార్పొరేటర్లు, 10 మంది ఎక్స్ అఫిషియో సభ్యులున్న ఎంఐఎం తమతోనే ఉందనే ధీమాతో మేయర్ గద్వాల విజయలక్ష్మి ఉన్నారు. బీఆర్ఎస్ ,బీజేపీ కలిసి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినా సంఖ్యా బలం లేక వీగిపోతుందన్న ధీమాతో ఉన్నారు




# దావోస్ టూర్ సక్సెస్..

## ఉత్సాహంగా స్వరాష్ట్రానికి సీఎం రేవంత్!

## గ్రాండ్ వెల్‌కమ్ చెప్పిన పార్టీ శ్రేణులు

హైదరాబాద్, జనవరి 24: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌కు చేరుకున్నారు. నాలుగు రోజుల దావోస్ పర్యటనను విజయవంతంగా ముగించుకొని సీఎం రేవంత్‌తో తెలంగాణ రైసింగ్ బృందం హైదరాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా సీఎంకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, కీలక నేతలు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యేలు మల్రెడ్డి రాంరెడ్డి, దానం నాగేందర్, ఈర్లపల్లి శంకర్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు కలిసి ముఖ్యమంత్రికి గ్రాండ్‌గా వెల్కమ్ చెప్పారు. భారీ పెట్టుబడులను ఆకర్షించి, కీలకమైన ఒప్పందాలు చేసుకుని, అంతర్జాతీయ దిగ్గజ సంస్థలను తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆకర్షించి రాష్ట్రానికి వచ్చిన రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ బృందానికి కాంగ్రెస్ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. తెలంగాణకు పెట్టుబడులే లక్ష్యంగా దావోస్‌కు వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి సక్సెస్ అయ్యారు. వివిధ దిగ్గజ కంపెనీలతో భేటీ అయి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా ఒప్పందాలు కుదర్చుకుంది తెలంగాణ ప్రభుత్వం. ముఖ్యమంత్రి రేవంత్, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో అనేక ప్రముఖ కంపెనీల అధినేతలు రాష్ట్రంలో పెట్టుబుడులు పెట్టేందుకు ముందుకు వచ్చారు. దాదాపు 20 కంపెనీలు రాష్ట్రంలో ఆయా సంస్థలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకున్నాయి. దిగ్గజ కంపెనీలతో 1.78 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎంవోయూ కుదర్చుకుంది తెలంగాణ సర్కార్. ఈ కంపెనీల రాకతో వేలల్లో ఉద్యోగాలు లభించే అవకాశం ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా దావోస్ పర్యటనలో భారీ పెట్టుబడులను తెలంగాణ సర్కార్ ఆకర్షించింది. ఈ నాలుగు రోజుల పర్యటనలో అంతర్జాతీయ దిగ్గజ సంస్థలతో 1.78 లక్షల కోట్ల పెట్టుబడులను కుదర్చుకుంది. అంతర్జాతీయ దిగ్గజ సంస్థ అయిన అమేజాన్ 60వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు తెలంగాణ సర్కార్‌తో ఒప్పందం కుదర్చుకుంది. దాంతో పాటు మరో కీలక సంస్థ సన్‌పెట్రో కెమికల్స్ సంస్థ రూ. 45,500 కోట్ల పెట్టుబడులు, కంట్రోల్ ఎస్ రూ. 10,000 కోట్లు, జేఎస్ డబ్ల్యూ సంస్థ రూ.800 కోట్ల పెట్టుబడులు, స్కైరూట్ ఏరో స్పేస్ రూ.500 కోట్ల పెట్టుబడులు, మేఘా ఇంజనీరింగ్ రూ.15000 కోట్ల పెట్టుబడులు, ఇన్ఫోసిస్ రూ.750 కోట్ల పెట్టుబడులు ఇలా అనేక అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. అందుకు సంబంధించి తెలంగాణ సర్కార్‌తో ఆయా సంస్థలు కీలక ఒప్పందాలు చేసుకున్నాయి. దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ సదస్సులో అంతర్జాతీయ పారిశ్రామిక వేత్తలతో రేవంత్ నేతృత్వంలోని రైజింగ్ బృందం విస్తృతంగా చర్చలు జరిపింది. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఏ విధంగా అనుకూలమైన వాతవారణం ఉంది, పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏవిధమైన పాలసీలు తీసుకువచ్చింది, కొత్తగా తీసుకొచ్చిన గ్రీన్ ఎనర్జీ పాలసీపై, ఎలక్ట్రిక్ వాహనాలకు ట్యాక్స్ ఎక్సెంప్షన్, ఐటీ పెట్టుబడుల పెట్టుబడులను పెట్టేందుకు తెలంగాణ సర్కార్ అందించే ప్రోత్సహకాల గురించి సమగ్రంగా ఆయా దిగ్గజ కంపెనీలకు తెలియజేసింది తెలంగాణ రైజింగ్ బృందం. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు అంతర్జాతీయ సంస్థలను ఆకర్షించడంలో రేవంత్ నేతృత్వంలోని రైజింగ్ బృందం సక్సెస్ అయ్యింది.

# సంపాదకీయం

## హైదరాబాద్ కిడ్నీ రాకెట్ లోతు రష్యాను తాకుతోందా?

హైదరాబాద్ లోని అలకనంద ఆసుపత్రిలో కిడ్నీ రాకెట్ వ్యవహారా న్నితవ్వే కొద్దీ షాకింగ్ అంశాలు వెలుగు చూస్తున్నాయి. తొమ్మిది పడకలున్న ఆసుపత్రిలో కిడ్నీ మార్పిడి సర్జరీ చేసేంత ఆపరేషన్ థియేటర్ లేని వేళ.. ఈ సర్జరీ లకు వేదికగా మారిన ఆసుపత్రులు ఎక్క డ? అవేంటి? అన్నది ప్రశ్నగా మారింది. కిడ్నీ సర్జరీలకు సెటప్ భారీగా ఉ ంటుందని.. అందుకు తగ్గ ఏర్పాట్లు ఏవీ అలకనంద ఆసుపత్రిలో లేవని చెబుతు న్నారు. దీంతో సర్జరీ ఒక చోట.. వారు కోలుకునేంతవరకు అలకనంద ఆసుప త్రిలో ఉంచుతున్నారా? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది. ఇదిలా ఉంటే అలక నంద కిడ్నీ రాకెట్ లో రష్యా.. ఉక్రెయిన్ తో సంబంధాలు ఉన్నాయన్న అనుమా నాలు వ్యక్తమవుతున్నాయి. ఆసుపత్రి యజమాని డాక్టర్ సుమంత్ రష్యాలో ఎంబీబీఎస్ చేయటం.. అక్కడ యరాల జిస్టులతో తనకున్న సంబంధాలతో.. వారిని ఇక్కడకు పిలిపించి మూత్రపిం డాల మార్పిడి సర్జరీలు చేయిస్తున్నట్లుగా తెలిసింది. అలకనంద వెబ్ సైట్ లో డాక్టర్ సుమంత్ తో పాటు.. ముగ్గురు విదేశీ వైద్యులను 'హెడ్ ఆఫ్ అలకనంద ఆస్పత్రి'గా పేర్కొన్నారు. వెబ్ సైట్ లో పేర్కొన్న ముగ్గురు విదేశీ వైద్యులు నిజంగానే ఆసుపత్రిలో భాగస్వాములా? లేదంటే సుమంత్ ఆ ఫోటోలను వాడుకున్నారా? అన్నది తేలాల్సి ఉంది. ఒకవేళ వారు నిజంగానే ఆసుపత్రి భాగస్వామ్యులైతే.. భారత్ లో సర్జరీలు చేసతునారా? అందుకు ఎంసీఐ లైసెన్సు తీసుకున్నారా? లాంటి ప్రశ్నలు తెర మీదకు వస్తున్నాయి. కొన్నేళ్ల క్రితం నల్గొండ కేంద్రంగా వెలుగు చూసిన కిడ్నీ రాకెట్ లోనూ.. దాతలు.. స్వీకర్తలను తమిళనాడు.. కర్ణాటక మీదుగా శ్రీలంక కు తరలించి.. అక్కడ మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ కేసులోనూ విదేశీ లింకులు ఉన్నాయన్న అనుమానాల్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ వ్యక్తం చేస్తోంది. ఇదంతా ఒక ఎత్తుఅయితే.. అసలీ సర్జరీలు ఎక్కడ జరిగి ఉంటాయి? అన్నదిప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. ఎందుకుంటే.. అలకనంద ఆసుపత్రి లాంటి చిన్న ఆసుపత్రిలో కిడ్నీ మార్పిడికి అవసరమైనంత టెక్నాలజీతో పాటు వస తులు ఉండవు. దీనికి తోడు.. ఈ సర్జరీకి వివిధ విభాగాలకు చెందిన వైద్యుల అవ సరం ఉంటుంది. కానీ.. అలాంటి వస తులు అక్కడేమీ లేని నేపథ్యంలో.. సర్జరీ లు ఎక్కడ జరిగి ఉంటాయన్నది తేలితే.. ఈ వ్యవహారం మరో మలుపు తిరుగు తుందని చెబుతున్నారు.



## ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకాలు : ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి



శామీర్ పేట, (గరుడ వార్త) : ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకాలు చేరుతాయని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం శామీర్ పేట లో జరిగిన ప్రజా పాలన గ్రామసభలో డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు రానివారు దిగులు చెందుద్దని, వారంతా తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇది నిరంతర ప్రక్రియని, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. ప్రభుత్వం ఈనెల 26 నుంచి ఇందిరమ్మ ఇల్లు, కొత్త రేషన్ కార్డులు, భూమిలేని రైతులకు నెలకు రూ. 1000 ఆర్థిక సాయం లాంటి ఆరు గ్యారంటీల్లో మిగిలిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తుందని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందిస్తామని, ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తో పాటు రైతు భరోసా ప్రతి రైతుకు సాగు చేస్తున్న ప్రతి ఎకరాకు అందజేస్తామని తెలిపారు. ఇంద్రమ్మ కమిటీ సభ్యులు రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్క స్థలమున్న, స్థలం లేని నిరుపేదలందరికీ ఇండ్లు వచ్చేలా చూడాలని సూచించారు. గత ప్రభుత్వం 10 ఏళ్ళుగా చేయలేని రైతు రుణమాఫీని రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసి చూపించిందని తెలిపారు. అలాగే ఉమ్మడి మండలంలోని వివిధ గ్రామాలలో ప్రజాపాలన గ్రామసభలు ఆయా గ్రామాల అధికారులతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ బొమ్మలపల్లి నరసింహులు యాదవ్, ఎంపీడీవో మమతాబాయి, తాహాసిల్దార్ యాదగిరి రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వజ్రేష్ యాదవ్, రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్, వివిధ శాఖల అధికారులు, సీ పీ ఐ జిల్లా కార్యదర్శి డి జి సాయిలు గౌడ్, శామీర్ పేట మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ గౌడ్, తూంకుంట మున్సిపల్ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, నాయకులు ముజీబ్ ఉద్దీన్, కిషోర్ యాదవ్, సుదర్శన్, సాయి బాబ, మహేందర్ యాదవ్, అరుణ్ కుమార్, వివిధ పార్టీల నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## అందరి చూపు.. ఆయిల్‌పాం వైపు



జగిత్యాల : గతంలో సముద్ర తీరప్రాంతంలో గాలిలో తేమశాతం అధికంగా ఉండటం ఆయిల్‌పాం సాగుకు కలిసి వచ్చింది. ఇటీవల ఉమ్మడి జిల్లాలోనూ సాగునీటి లభ్యత పెరగటం, వాతావరణ మార్పులతో ఆయిల్‌పాంను సాగు చేయొచ్చని శాస్త్రవేత్తలు గుర్తించారు. కూలీల కొరత, వన్యప్రాణులతో ఆరుతడి పంటలు సాగు చేయలేని చోట, వరికి ప్రత్యామ్నాయ పంటగా, చీడపీడలతో తొలగిస్తున్న మామి డి స్థానంలో అనువైన పంటగా అన్నదాతలు ఆయిల్‌పాంను భావిస్తున్నా రు. ఇదే తరుణంలో ప్రభుత్వం ఆయిల్‌పాం సాగుకు రాయితీలను కల్పించటం, ఆయా జిల్లాల్లో కంపెనీల ద్వారా కొనుగోలు భరోసా ఉ ండటం, ఇటీవల ఆయిల్‌పాం గెలల ధర టన్నుకు రూ.12,400 నుంచి రూ.20,400కు చేరటంతో అందరిచూపూ ఈ పంటపైనే కేంద్రీకృతమైంది.

**ఉమ్మడి జిల్లాలో లక్ష్యం ఇదే..**

ప్రభుత్వం ఆయిల్‌పాం సాగును ప్రోత్సహిస్తూ ఉమ్మడి జిల్లాలో నాలుగేళ్లలో 1.31 లక్షల ఎకరాల్లో రైతులతో సాగు చేయించాలని నిర్ణయించారు. ఆయిల్‌ఫెడ్ నుంచి అనుమతులు పొందిన కంపెనీలు ఆయా జిల్లాల్లో నర్సరీలను ఏర్పాటుచేసి మొక్కలను పెంచుతూ రైతుల తోటల్లో నాటుతున్నారు. తొలి ఏడాది నాటిన తోటల్లో మొక్కలు గెలలు వేస్తున్నాయి. ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనే గానుగ (క్రషింగ్ ద్వారా నూనె తీసే) పరిశ్రమలుండగా జగిత్యాల జిల్లాలోని యశ్వంతరావుపేట వద్ద క్రషింగ్ యూనిట్ను ఏర్పాటు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో మరో రెండు చోట్ల పరిశ్రమలకు చర్యలు తీసుకుంటున్నారు. ఆయిల్‌పాం సాగుకు డ్రిప్, మొక్కలు, నిర్వహణ ఖర్చు తదితరాలకు హెక్టారుకు రూ.50 వేల వరకు రాయితీని నాలుగేళ్లలో ఇస్తున్నారు.

**ఇలా చేస్తే మరింత మేలు**

ఉమ్మడి జిల్లా రైతులకు ఆయిల్‌పాం సాగులో అనుభవం తక్కువ ఉన్నందున భారత ఆయిల్‌పాం పరిశోధన సంస్థ, ఆంధ్రప్రదేశ్ పెదవేగి ఆయిల్‌పాం పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, ప్రైవేటు కంపెనీల శాస్త్రవేత్తలు, ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులు రైతుల తోటలను ఎప్పటికప్పుడు సందర్శించాలి. పురుగులు, తెగుళ్ల నిరోధం, మొక్కల ఎదుగుదలను, అంతర పంటల సాగును రైతులకు వివరించాలి. ప్రస్తుతం ఇతర దేశాల నుంచి దిగుమతి సుంకాన్ని పెంచటంతో దేశీయంగా గెలల ధరలు పెరగగా ముమ్ముందు గెలల అమ్మకం, ధరల తగ్గుదల, విక్రయ సమస్యలు తలెత్తకుండా చూడాలి. రాయితీ మొత్తాన్ని సకాలంలో విడుదల చేయాలి. - పంట బీమా వర్తింపజేయాలి. ఆయిల్‌పాం మొక్కలు నాటిన 5 ఏళ్ల నుంచి ఎకరాకు రూ.44 వేల వరకు పంట రుణాన్ని ఇవ్వనుండగా తొలి సంవత్సరం నుంచే రుణాన్ని మంజూరు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

## పిల్లల దత్తత...చట్టబద్ధత

గోదావరిఖని : నిబంధనలు పాటించకుండా చిన్నారులను అక్రమంగా దత్తత తీసుకోవడం.. విక్రయించడం వల్ల ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఆర్మూర్‌లో ఇటీవల కన్నతల్లే ముగ్గురు కుమారులను అక్రమంగా విక్రయించినట్లు బయటపడింది. దీంతో ఆ తల్లిపై, పిల్లలను కొనుగోలు చేసిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. చిన్నారుల అక్రమ విక్రయం వల్ల పర్యవేక్షణ లోపించి.. వారిని అసాంఘిక కార్యకలాపాల్లోకి దించే ప్రమాదం ఉంది. పిల్లలు కలగనివారు చట్టప్రకారం, ప్రభుత్వ నిబంధనల మేరకు దత్తత తీసుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

**పెంచే స్థోమత లేకపోతే..**

పిల్లలను పెంచే స్థోమత లేనివారు, వద్దనుకునే దంపతులు వారిని శిశు సంక్షేమ కమిటీకి అప్పగించాలి. నిబంధనల ప్రకారంగా వారిని ఆయా జిల్లాలోని శిశు గృహలో చేర్చుకుంటారు. వారిని 45 రోజుల పాటు సంరక్షణలో ఉంచి.. మరోసారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అప్పటికీ వారు నిర్ణయం మార్చుకోకపోతే ప్రభుత్వమే పిల్లలను శిశు గృహలో చేర్చుకొని తిరిగి దత్తత ఇస్తుంది.

**ఉమ్మడి జిల్లా నుంచి 88 మంది**

ఉమ్మడి జిల్లా కేంద్రంలోని శిశు గృహలో 2011 నుంచి తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా, న్యూఢిల్లీ తదితర ప్రాంతాల్లోని వారికి 83 మందిని, ఇటలీ, అమెరికా, సింగాపూర్ దేశాలకు చెందిన వారికి అయిదుగురు పిల్లలను దత్తత ఇచ్చారు. వీరిలో అత్యధికంగా 71 మంది రాష్ట్రానికి చెందివారే.

**దరఖాస్తు విధానం**

కేంద్ర ప్రభుత్వ కారా(సెంట్రల్ అడాప్షన్ రిసోర్సు అథారిటీ) వెబ్‌సైట్‌లో పిల్లల కోసం దరఖాస్తు చేసుకోవాలి. సమగ్ర శిశు అభివృద్ధి శాఖ(ఐసీడీఎస్) ఆధ్వర్యంలో దరఖాస్తుదారుల వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇస్తారు. దీని ఆధారంగా దరఖాస్తుదారులను సీనియారిటీ జాబితాలో చేరుస్తారు. సీనియారిటీ ప్రకారంగా బాబు/పాపను దత్తత ఇస్తున్నట్లుగా సమాచారం అందిన 48 గంటల్లోగా రూ.50 వేల డీడీ చెల్లించి వారు పిల్లలను తీసుకోవాలి. నెలలోగా జిల్లా కలెక్టర్ దత్తత ధ్రువీకరణ పత్రం అందిస్తారు. నిర్ణీత గడువులోగా బాబు/పాపను తీసుకోనట్లయితే సీనియారిటీ జాబితాలోంచి పేరు తొలగిస్తారు. తిరిగి కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిందే. దత్తత పిల్లల పోషణ తదితర విషయాలపై వారికి 18 సంవత్సరాల వయస్సు వచ్చేంత వరకు శిశు సంక్షేమ శాఖ పర్యవేక్షిస్తుంది. దరఖాస్తుదారులు పిల్లలను ఇబ్బందులకు గురిచేస్తే వారిని తిరిగి తీసుకువెళతారు. ఫోస్టర్ కేర్‌లో భాగంగా వారికి 21 సంవత్సరాల వయస్సు వచ్చేంత వరకు వసతి కల్పిస్తూ చదివిస్తారు.

**ఎవరు అర్హులు**

తోబుట్టువులను ఒకే కుటుంబానికి దత్తత ఇస్తారు. నివాసం ఉంటున్న జిల్లాలో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

బాలల హక్కులు దుర్వినియోగ పరిచిన వారు, చట్టప్రకారంగా శిక్ష అనుభవించిన వారు అనర్హులు.

పిల్లలను దత్తత పొందేవారు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలి. ఆర్థిక స్థిరత్వం కలిగి ఉండాలి

సంతానం లేని దంపతులు, వితంతువులు, విడాకులు తీసుకున్న వారు

ఒంటరిగా జీవిస్తున్న వారు- ఒంటరి మహిళలు అబ్బాయి, అమ్మాయిల్లో ఎవరినైనా దత్తత తీసుకోవచ్చు. ఒంటరి పురుషులు మాత్రం కేవలం అబ్బాయిని మాత్రమే తీసుకోవాలి.

జతచేయాల్సిన పత్రాలు భార్యాభర్తలు కలిసి ఉన్న ఫొటోలు-4, ఆధార్‌కార్డులు, ఒకరిది పాన్‌కార్డు.

విద్యాసంస్థ జారీ చేసిన జనన.. రూ.2 లక్షలకు పైన ఆదాయ పత్రాలు. సబ్ రిజిస్ట్రార్ జారీ చేసిన దంపతుల వివాహ ధ్రువీకరణ పత్రం, దంపతుల ఆరోగ్య ధ్రువీకరణ పత్రం - దంపతులపై కేసులు లేనట్లుగా ఠాణా నుంచి ధ్రువీకరణఆస్తుల వివరాలు. ఒంటరి వారైతే విడాకుల డిక్రీ/మరణ ధ్రువపత్రం, బంధువుల జమానతు పత్రాలు.

## కేజీబీవీలు, యూఆర్ఎస్‌ల్లో కుంటుపడిన బోధన

సిరిసిల్ల : సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె ప్రభావం బోధనపై పడింది. జిల్లాలోని కేజీబీవీలు, యూఆర్ఎస్‌లో విద్యాబోధన నిలిచిపోయింది. మండల విద్యాశాఖ కార్యాలయాలు తెరవడం లేదు. భవిత కేంద్రాలు మూతపడ్డాయి. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ గత తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తుండటంతో ఈ పరిస్థితి నెలకొంది. విద్యాశాఖలో అనుబంధంగా గత 19 సంవత్సరాలుగా సమగ్ర శిక్షా ఉద్యోగులు, సిబ్బంది పని చేస్తున్నారు. డీపీవో సిబ్బంది అయిదుగురు, కేజీబీవీ, యూఆర్ఎస్ ఉద్యోగులు, సిబ్బంది 294, సీఆర్‌పీలు 50, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు 13, ఐఈఆర్‌పీలు 13, మెసెంజర్స్ 13 మంది పని చేస్తున్నారు. వీరంతా సమ్మెబాట పట్టడంతో జిల్లాలోని 13 కేజీబీవీలతోపాటు ఒక అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల (యూఆర్ఎస్), భవిత కేంద్రాల్లో బోధన కుంటుపడింది. జిల్లాలోని కొన్ని కేజీబీవీల్లోనే ఇంటర్మీడియట్ తరగతులు నిర్వహిస్తున్నారు. 10వ తరగతి విద్యార్థులకు సిలబస్ పూర్తికాలేదు. పాఠాలు చెప్పేవారు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ప్రతి కేజీబీవీలో ఇద్దరు టీచర్లు, ఇద్దరు సిబ్బంది మాత్రమే ఉంటున్నారు. విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు పాఠాలు చెబుతుండగా, సిబ్బంది మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షలు దగ్గర పడుతుండటంతో సిలబస్ పూర్తి చేసి రివిజన్, ప్రత్యేక తరగతుల తో పాటు స్లిప్ టెస్టులు నిర్వహించే సమయంలో కేజీబీవీ ఉద్యోగులు సమ్మెబాట పట్టడం తీవ్ర ప్రభావం చూపనుంది.

**సీఆర్‌పీల పనులు ఎలా...**

జిల్లాలో 33 క్లస్టర్లు ఉండగా 50 మంది సీఆర్‌పీలు పని చేస్తున్నారు. వీరిని కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు కేటాయించారు. ఒక్కో సీఆర్‌పీ వారి క్లస్టర్ పరిధిలోని ఒకటి లేదా రెండు పాఠశాలలను సందర్శించి ఆన్‌లైన్‌లో నమోదు చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుతో పాటు మధ్యాహ్న భోజన వివరాల సమాచారాన్ని పరిశీలిస్తుంటారు. బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పిస్తారు. పాఠశాలల నుంచి విద్యార్థుల వివరాలు సేకరించి యూడైస్‌లో నమోదు చేస్తారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లోని ఉపాధ్యాయుడు సెలవుపై వెళ్లినపుడు ఆ క్లస్టర్ పరిధిలోని సీఆర్‌పీ ఆ పాఠశాలను నడిపిస్తారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించడం, పాఠశాల ఖర్చుల వివరాలు సేకరించి జిల్లా విద్యాధికారులకు అందజేయడం చేస్తుంటారు.

**ఇవీ డిమాండ్‌లు...**సమగ్ర శిక్షా ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలి. అప్పటి వరకు పే స్కేలు ఇవ్వాలి.

ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ.10 లక్షలు, ఆరోగ్య బీమా రూ.10 లక్షల సౌకర్యం కల్పించాలి. ఉద్యోగ విరమణ చేసిన వారికి బెనిఫిట్స్ కింద రూ.25 లక్షలు చెల్లించాలి. ప్రభుత్వ, విద్యాశాఖ నియామకాల్లో వెయిటేజీ కల్పించాలి. పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లకు 12 నెలల వేతనం ఇవ్వాలి. ఉద్యోగులందరికీ రీ ఎంగేజ్ విధానాన్ని తొలగించాలి.

**హామీలు నెరవేర్చాలి**

ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని నిరవధిక సమ్మె చేస్తున్నాం. ప్రస్తుతం అందరూ సమ్మెలోకి వస్తే విద్యార్థులకు ఇబ్బంది అవుతుందని, ప్రతి కేజీబీవీలో నలుగురు పని చేస్తున్నారు. ప్రభుత్వం మరో మూడు రోజుల్లో స్పందించి డిమాండ్లను నెరవేర్చకుంటే పూర్తి స్థాయి సమ్మెలోకి వెళ్తాం. కేజీబీవీలు, యూఆర్ఎస్‌లకు తాళం వేసి విద్యాశాఖ కార్యాలయంలో అప్పగిస్తాం. ఇప్పపూల దేవేందర్, సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

## నేత.. నీటిరాత..!

నల్గొండ: ఉమ్మడి జిల్లా రైతులకు సాగునీటి ప్రాజెక్టుల పనులు ఊరట కలిగిస్తున్నాయి. యాసంగి పంటకాలానికి సాగర్ ఎడమకాల్వ పరిధిలోని ఆయకట్టు కింద వారాబందీ పద్ధతిలో నీటిని విడుదల చేయనున్నారు. నాగార్జునసాగర్, పులిచింతల, మూసీ ప్రాజెక్టులతో ఏటా ఉమ్మడి జిల్లాలో 15 లక్షల ఎకరాల మేర వివిధ పంటలకు సాగునీటిని అందుతున్నాయి. వానాకాలంలో 12.20 లక్షల ఎకరాల్లో వరి, 1.50 లక్షల ఎకరాల్లో మిగిలిన పంటలు సాగవగా.. యాసంగిలోనూ గరిష్ఠంగా 14 లక్షల ఎకరాల వరకు సాగుచేయనున్నారు. **పురోగతిలో ప్రాజెక్టులు**

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న హుజుర్‌నగర్ నియోజకవర్గంలో సాగర్ ఎడమకాల్వపై ఎత్తిపోతల పథకాలన్నీ పూర్తి చేయనున్నారు. రూ.817 కోట్లతో పులిచింతల నుంచి ముత్యాల బ్రాంచ్ కెనాల్(ఎంబీసీ)కు ఎత్తిపోతల పథకాన్ని నిర్మించనుండగా.. ప్రస్తుతం భూసేకరణ పనులు జరుగుతున్నాయి. జాన్‌పాడులో రూ.118 కోట్లతో ఎత్తిపోతల పథకం పనులు, మేళ్లచేరువు, చింతలపాలెంతో పాటు మిగిలిన 6 చోట్ల సుమారు రూ.500 కోట్లతో ఎత్తిపోతల పథకాల పనులు పురోగతిలో ఉన్నాయి. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నల్గొండ నియోజకవర్గ కేంద్రంలో మొత్తం రూ.50 కోట్లతో నర్సింగ్‌భట్ల, కంచనపల్లి-బక్కతాయికుంట, కనగల్ మండలంలోని పానుగోడు ఎత్తిపోతల పథకాలు మంజూరు చేశారు. శ్రీశైలం ఎడమ గట్టు కాలువ(ఎస్ఎల్‌బీసీ) పథకానికి ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.4,540 కోట్లు పెంచి ఆ నిధులు మంజూరు చేశారు. బేరింగ్ బిగింపు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. పెండ్లిపాకల నిర్మాణాల పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

మునుగోడులో చర్లగూడెం, లక్ష్మణాపురం రిజర్వాయర్లకు కృష్ణానీటిని, పిల్లాయిపల్లి కాలువలోకి గోదావరి నీటిని తరలించనున్నారు. మొత్తం 669 చెరువులతో పాటు వాగులపై చెక్‌డ్యాంలు, మట్టితో కూడిన మత్తళ్లు, శేషలేటి వాగు, వెల్మకన్నె ఫీడర్ ఛానల్‌లను అభివృద్ధి చేస్తే నియోజకవర్గంలోని ప్రతి ఎకరానికి సాగునీరు అందించే అవకాశం ఉంది. భువనగిరిలో బునాదిగాని కాలువ పూర్తి చేసేందుకు ప్రభుత్వం రూ.269 కోట్లు మంజూరు చేయగా పనులు త్వరలో జరగనున్నాయి. కాళేశ్వరం ప్యాకేజీ-16లో భాగంగా నృసింహసాగర్ జలాశయం నుంచి ముత్తిరెడ్డి గూడెం, రాయగిరి చెరువులతో పాటు స్థానికంగా ఉన్న 10 చెరువుల్లోనూ నీళ్లు నింపనున్నారు. భవిష్యత్తులో కుడి కాలువ ద్వారా బీబీనగర్, భువనగిరి పెద్దచెరువులను నింపేలా కార్యాచరణ సిద్ధమవుతుంది. మూసీపై నిర్మాణంలో ఉన్న ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి, బునాదిగాని కాల్వలకు రూ.565 కోట్ల నిధులను మంజూరు చేశారు. నాగార్జునసాగర్‌లో ఇప్పటికే డీ-8, డీ-9 కాల్వల సమస్య పరిష్కారం కావడంతో రంగుండ్ల, కుంకుడు చెట్టు గ్రామాల పరిధిలో ఉన్న 7 వేల ఎకరాల్లో, త్వరలో నెల్లికల్ ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తయితే 5 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది.

మిర్యాలగూడలో గత మూడేళ్ల నుంచి సుమారు రూ.500 కోట్లతో దాదాపు 8 వేల ఆయకట్టుకు సరిపడా కృష్ణానదిపై వాడపల్లి-బోత్కలపాలెం, అడవిదేవులపల్లి మండలంలోని దున్నపోతుల గండి, మూసీ నదిపై కొండ్రపోల్-కేశవాపురం ఎత్తిపోతల పథకాల పనులు జరుగుతున్నాయి. దేవరకొండలో ఎస్సెల్బీసీ సొరంగం మార్గం పనులు ముందుకు సాగుతున్నాయి. రూ.30 కోట్లతో డిండి ఎత్తిపోతలతో పాటు పెండ్లిపాకల, నక్కలగండి పనులు తుది దశలో ఉన్నాయి.

# శుభ్రత ఎక్కడ?

వేములవాడ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో వివిధ విభాగాల కార్యాలయాలు ఉన్నాయి. వాటిలో మరమ్మతులకు గురైన, పనికి రాకుండా పోయిన వస్తు సామగ్రి కుప్పలు తెప్పలుగా పేరుకుపోయి కార్యాలయాల పరిసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. పాత సామగ్రిని ఎప్పటికప్పుడు తొలగించి పరిశుభ్రంగా ఉంచాల్సిన ఆలయ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం చేస్తుండటంతో ఈ దుస్థితి నెలకొంది. అక్కడ పరిస్థితిని చూసిన వారు ముక్కున వేలేసుకుంటున్నారు.

రాజన్న ఆలయ ఈవో కార్యాలయం భవనంలోని వివిధ విభాగాల కార్యాలయాల్లో ఉద్యోగులు పని చేస్తుంటారు. ఇదే భవనం బయట పిట్టగోడ స్లాబ్‌పై పెద్ద ఎత్తున పాత సామగ్రి గుట్టలుగా పేరుకుపోయింది. కుర్చీలు, కూలర్లు, ఇనుప పెట్టెలు, ఇతరత్రా సామగ్రి పేరుకుపోయింది. ఇదే భవనం పైఅంతస్తులోనూ పాత సామగ్రి గుట్టలుగా పడి ఉంది. కార్యాలయం పిట్ట గోడ ప్రాంతంలో ఎటు చూసినా అపరిశుభ్రంగా మారింది. ఓపెన్ స్లాబ్ భవనంలోని ఎలక్ట్రికల్ గదిలో, భవనం పైన పెద్ద ఎత్తున పనికి రాని విద్యుత్ పరికరాలు, వైర్లు, నూనె డబ్బాలు, పైపులు తదితర వాటిని పడేశారు. ఆలయ పరిసరాల్లోనూ పనికి రాని సామగ్రి దర్శనమిస్తుంది. అయినా



అధికారులకు దీని తొలగింపుపై పట్టింపు కరవైందనే విమర్శలున్నాయి.

**వసతి గదుల్లోనూ అంతే...**

రాజన్న ఆలయ వసతి గదుల్లోనూ పనికి రాని మంచాలు, పరుపులు, కుర్చీలు తదితర సామగ్రి దర్శనమిస్తుంది. దీంతో పాటు భీమేశ్వర సదన్‌లోని నీటి సరఫరా ట్యాంక్ ప్రాంతంలో పెద్ద ఎత్తున గుట్టలుగా పేరుకుపోయింది. ఇదే అదనుగా కొంత మంది అందులో ఉపయోగపడే ఇనుము, ఇతరత్రా వస్తువులను మాయం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇటీవల ఆలయంలోని పాత ఇత్తడి సామగ్రిని అధికారులు టెండర్ ద్వారా పెద్ద ఎత్తున విక్రయించారు. ఇదే విధంగా ప్రస్తుత పాత సామగ్రిని కూడా టెండర్ ద్వారా విక్రయిస్తే ఆలయానికి ఆదాయం సమకూరడంతో పాటు కార్యాలయాలు పరిశుభ్రంగా ఉంటాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**టెండర్ పిలిచాం** ఆలయానికి సంబంధించిన కార్యాలయాల ప్రాంతాల్లో పాత సామగ్రి నిల్వ ఉంది. దీనిని విక్రయించేందుకు టెండర్ పిలిచాం. పాత సామగ్రిని పూర్తిగా తొలగించి శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. వినోద్‌రెడ్డి, ఆలయ ఈవో, వేములవాడ

# చెర్వుగట్టు.. తీరేనా ఇక్కట్లు..!

నార్కట్‌పల్లి : చెర్వుగట్టులోని శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి గుహాలయంలో ఫిబ్రవరి 2న నగరోత్సవంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. వీటికి తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. కల్యాణం, అగ్నిగుండాల రోజున 3 లక్షల వరకు భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే తాత్కాలికంగా పనులు చేపట్టేందుకు రూ.లక్షల ఖర్చు చేస్తున్నారు కానీ శాశ్వత పనులపై దృష్టి సారించడం లేదని భక్తులు చెబుతున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిలు ప్రత్యేక దృష్టి సారించి వీటికి శాశ్వత పరిష్కారం చూపుతారని భక్తులు, గ్రామస్థులు ఎదురు చూస్తున్నారు.

**ముఖ్యమైన సమస్యలివి...**

కొండపైన డ్రైనేజీ సక్రమంగా లేకపోవడంతో అమావాస్య, సోమవారం, సెలవులు, పండుగ రోజుల్లో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లక్షల్లో తరలి వచ్చే భక్తుల కోసం 70 మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయి. బ్రహ్మోత్సవాల సమయంలో అదనంగా మరో 30 వరకు తాత్కాలికంగా ఏర్పాటు చేస్తారు.

ఘాట్‌రోడ్డు ఇరుకుగా ఉండడంతో భక్తుల అధిక సంఖ్యలో వచ్చిన రోజు వాహనాలు కొండపైకి అనుమతించకపోవడంతో, ప్రైవేటు ఆటోలో ప్రయాణిస్తూ అధిక డబ్బులు చెల్లించి కొండపైకి చేరుకుంటున్నారు.

యల్లారెడ్డిగూడెం, నార్కట్‌పల్లి నుంచి కొండకు వచ్చే మార్గాలు ఇరుకుగా ఉండడంతో అధిక సంఖ్యలో భక్తుల వాహనాలతో వచ్చిన సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిని వెడల్పు చేయాలని భక్తులు కోరుతున్నారు.

కొండపైన తాగు నీటి సౌకర్యం లేకపోవడంతో భక్తులు డబ్బులు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు.

నిత్యం రద్దీగా ఉండే క్షేత్రంలో మరుగుదొడ్లకు తలుపులు సరిగా లేవు. కొండ కింద పార్వతీ అమ్మవారి ఆలయంలో కొత్తగా కొనుగోలు చేసిన వాహనదారులుకు పూజలు జరుపుతున్న సమయంలో అధిక డబ్బులు వసూలు చేస్తున్నారు. ధరలు కనిపించేలా బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంది. అన్ని వసతి గృహాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు స్నానఘట్టాలు, భక్తుల విడిదికి చలువ పందిర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

# జర చూడు.. వెలిమినేడు..!

నల్గొండ : యువతకు స్వయం ఉపాధి అవకాశాలే లక్ష్యంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోంది. తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మార్కెట్ ధర కంటే తక్కువ ధరల్లోనే భూములు విక్రయించి ప్రత్యేక ఆహారశుద్ధి పరిశ్రమలు (స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్) ఏర్పాటు చేసి ప్రోత్సహిస్తుంది. వారి అవసరాలకు అనుగుణంగా భూములను తీర్చిదిద్దడం, రహదారులు, తాగునీరు, కాలుష్య శుద్ధీకరణ ప్లాంట్ల ఏర్పాట్లు, వీధి దీపాలు, విద్యుత్తు అవసరాలు ఈ సంస్థ అందజేస్తుంది. గత ప్రభుత్వ హయాంలో నల్గొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో పారిశ్రామిక అవసరాల కోసం ప్రభుత్వ అసైన్డ్, పట్టా భూములున్నట్లు గుర్తించింది. వరసగా ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో 'ఎక్కడ వేసిన గొంగళి' అక్కడే అన్న చందంగా మారి పురోగతి పనులు ముందుకు సాగడం లేదు. చిట్యాల మండలంలో ఇప్పటికే ఫార్మా సంస్థలుండగా స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవ చూపిస్తే వేలాది మంది హైదరాబాద్‌కు ఉపాధి కోసం వలస వెళ్లాల్సిన అవసరం లేదని స్థానిక యువత అభిప్రాయపడుతున్నారు. **అన్ని వసతులు కల్పిస్తే...** ఐదేళ్ల క్రితం అప్పటి టీఎస్ఐఐసీ ప్రస్తుత టీజీఐఐసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి 70 కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారి–65కి ఇరువైపులా విస్తరించిన వెలిమినేడు గ్రామంలో 475.32 ఎకరాలు గుర్తించింది. ఒక్కో ప్రాజెక్టుకు రూ.90 లక్షల చొప్పున మొత్తం రూ.146 కోట్లతో 162.28 ఎకరాల మేర అధికారులు ఇప్పటికే సేకరించారు. ఇంకా 313.04 ఎకరాలు సేకరించాల్సి ఉంది. మొత్తం 180 ప్లాట్లు ఉండగా 24 ప్లాట్లు ఇప్పటికే ఆన్‌లైన్‌లో కేటాయించారు. ఇంకా 26 ప్లాట్లు ఖాళీగా, మిగిలినవి హద్దులు నిర్ణయించాల్సి ఉంది. మొత్తం 530 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మరో 500 మంది వరకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

# నోటిఫికేషన్‌కే పరిమితం



మెట్‌పల్లి: జిల్లాలో కొత్తగా మండలాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు ప్రతిపాదనలు వస్తుండడంతో బండలింగాపూర్ మండలం ఏర్పాటు అంశం మళ్లీ తెర పైకి వచ్చింది. భారాస ప్రభుత్వ హయాంలో బండలింగాపూర్ మండలం ఏర్పాటుకు ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసి అభ్యంతరాలు, వినతులు స్వీకరించారు. ఆ తర్వాత కార్యాచరణ ముందుకు సాగకపోవడం, ప్రభుత్వం మారడంతో మండలం ఏర్పాటు ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం గ్రామస్థులు అధికారులు, ప్రజాప్రతినిధులను కలుస్తూ మండలం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పరిపాలనా సౌలభ్యం కోసం 2016లో కొత్తగా జిల్లాలు, మండలాలు ఏర్పాటు చేసిన సమయంలో 14 పంచాయతీలతో ఉన్న మెట్‌పల్లి మండలం, ఇబ్రహీంపట్నం మండలంలోని మేడిపల్లి, సత్తక్కపల్లి, రాజేశ్వర్‌రావుపేట, బండలింగాపూర్, కోరుట్ల మండలంలోని పెద్దాపూర్ గ్రామాలను విలీనం చేశారు. రెండు పంచాయతీలు మున్సిపాలిటీలో కలపగా కొత్తగా ఏర్పడ్డ వాటితో కలిపి 23 పంచాయతీలతో మండలం రూపుదిద్దుకొంది. ఆ తర్వాత బండలింగాపూర్, జగ్గాసాగర్ గ్రామాలను మండలాలుగా ఏర్పాటు చేయాలన్న డిమాండ్ లేవనెత్తారు. మండల సాధన కమిటీల ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ క్రమంలో 2022 డిసెంబర్‌లో జగిత్యాల పర్యటనకు వచ్చిన అప్పటి సీఎం కేసీఆర్ బండలింగాపూర్‌ను మండలంగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత 2023 జూన్‌లో మెట్‌పల్లి మండలాన్ని విభజించి పది రెవెన్యూ గ్రామాలతో బండలింగాపూర్ మండలం ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ సమయంలో బండలింగాపూర్ మండలంలో కలవడానికి పలు గ్రామాలు అభ్యంతరాలను తెరపైకి తీసుకురావడంతో జగ్గాసాగర్‌ను మండలం ఏర్పాటు చేయాలని డిమాండ్ వినిపించడంతో బండలింగాపూర్ మండల ఏర్పాటు కార్యరూపం దాల్చలేదు.

**నెరవేరని ఆకాంక్ష** బండలింగాపూర్ మండలం ఏర్పాటుపై తుది నోటిఫికేషన్ జారీ కాకపోవడంతో ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న స్థానికుల ఆకాంక్ష నెరవేరకుండా పోయింది. పది రెవెన్యూ గ్రామాల్లో పదిహేను గ్రామాలతో మండలాన్ని ప్రతిపాదించినా చాలా గ్రామాలు తమను మెట్‌పల్లి మండలంలోని కొనసాగించాలని అభ్యంతరాలు వ్యక్తం కావడం, అదే సమయంలో శాసనసభ ఎన్నికలు రావడంతో మండలం ఏర్పాటు ప్రక్రియ ముందుకు సాగలేదు. ప్రస్తుతం బండలింగాపూర్ మండలం ఏర్పాటు చేయాలని గ్రామాభివృద్ధి కమిటీ, మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇటీవల అదనపు కలెక్టర్‌ను కలిసి విన్నవించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కాంగ్రెస్ నాయకులతో పాటు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ముఖ్యమంత్రిని కలవాలన్న ఆలోచనలో ఉన్నారు.

# తినే టీ కప్పు.. రాష్ట్రంలోనే తొలి యూనిట్




మానకొండూర్: మనం ప్లాస్టిక్ కప్పులో టీ తాగిన తర్వాత పడేస్తాం. అదే గ్లాస్ లేదా స్టీల్ అయితే శుభ్రం చేసి మళ్లీ వాడతాం. కానీ ఇక్కడ మాత్రం టీ తాగిన తర్వాత కప్పును తినొచ్చు. అలాంటి ఎడిబుల్ కప్పుల తయారీ కేంద్రం రాష్ట్రంలోనే మొదటిసారిగా కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం అన్నారంలో నెలకొల్పడంతో ఆదర్శంగా నిలిచిన యూనిట్‌పై ప్రత్యేక కథనం.

**రూ.3.80 లక్షల వ్యయంతో..**

మూడు నెలల క్రితం జమ్మికుంటలో జరిగిన కృషి విజ్ఞాన కేంద్ర సమావేశానికి అన్నారం సహకార సంఘం హాజరైంది. అక్కడ ఎడిబుల్ కప్పులో టీ తాగడంతో.. ఎక్కడినుంచి తెప్పించారని సదరు నిర్వాహకులను అడిగారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి నుంచి తెప్పించామని వివరించడంతో.. వెంటనే సంఘం తరఫున తొలుత వెయ్యి కప్పులకు ఆర్డర్ పెట్టారు. విశేష స్పందన రావడంతో ఏకంగా తయారీ కేంద్రాన్నే ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. రూ.3.80 లక్షల వ్యయంతో యూనిట్ ఏర్పాటు చేయడంతో.. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రారంభించారు. తెలంగాణలోనే మొదటి యూనిట్‌గా పేరు పొందింది.

**చిరు ధాన్యాలతో తయారీ**

ఎడిబుల్ కప్పులను రాగులు, బియ్యం, మైదా, మొక్కజొన్న పిండిలో తగినంత చక్కెరను కలిపి తయారు చేస్తున్నారు. ఒక్కో కప్పునకు రూ.3.50 ఖర్చు అవుతుండగా.. 50 పైసల ఆదాయం వస్తుందని చెబుతున్నారు. రోజు సుమారు వెయ్యి కప్పులను తయారు చేస్తుండగా.. 40 కిలోల పిండి అవసరమవుతుంది. ఇటీవల హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన మేళాలో ప్రదర్శించడంతో విశేష స్పందన లభించింది. ఖమ్మం, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నల్గొండ, కొత్తగూడెం, కరీంనగర్, పెద్దపల్లిలోని హోటళ్లకు సరఫరా చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

**పర్యావరణానికి మేలు**

పేపర్ కప్పులో టీ తాగితే అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది. అదే ఈ ఎడిబుల్ కప్పులో టీ తాగడం ద్వారా కప్పును తినొచ్చు. తయారు చేసిన తర్వాత వృథా అయిన ధాన్యం పాడి ఆవులు, గేదెలకు మేతగానూ ఉపయోగపడుతుంది.

**ఎనిమిది జిల్లాలకు సరఫరా**

తెలంగాణలోని ఎనిమిది జిల్లాలకు కప్పులను సరఫరా చేస్తున్నాం. మూడు నెలల క్రితం యూనిట్‌ను ప్రారంభించాం. త్వరలోనే మొక్కజొన్న పిండితో ఇస్తారాకుల యూనిట్ ఏర్పాటు చేస్తాం. సంఘం సభ్యుల సహకారంతో ముందుకు సాగుతున్నాం. పురుషోత్తంరెడ్డి, సంఘం అధ్యక్షుడు

# నీలగిరిలో ఫ్లెక్సీల గోల

నల్గొండ : నల్గొండలో ఫ్లెక్సీల వ్యవహారం కాంగ్రెస్, భారాస శ్రేణుల మధ్య వాగ్వాదానికి దారితీసింది. మున్సిపల్ కార్యాలయం వేదికగా ఇరు పార్టీల నేతలు ఒకరిపై ఒకరు పూల కుండీలు, కుర్చీలు విసురుకున్నారు. ఘటనలో కాంగ్రెస్ కార్యకర్త సైదిరెడ్డి తలకు గాయం అయింది. రాజకీయ ఘర్షణలో నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పట్టణంలో ప్రత్యేకంగా పోలీసులు మోహరించారు. మాజీ మంత్రి కేటీఆర్ రైతు మహాధర్నా కార్యక్రమాన్ని పురస్కరించుకొని భారాస శ్రేణులు పట్టణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలకు అనుమతి లేకపోవడం, కేటీఆర్ పర్యటన రద్దు కావడంతో పుర యంత్రాంగం ఫ్లెక్సీల తొలగింపు కార్యక్రమం చేపట్టింది. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ సైదిరెడ్డిలు పుర కార్యాలయానికి వచ్చారు. కమిషనర్‌కు ఫోన్ చేస్తే స్పందించడం లేదని కమిషనర్ ఛాంబరులో భారాస కార్యకర్తలతో కలిసి ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు పుర కార్యాలయానికి చేరుకుని వేరే చోట ఆందోళన చేసుకోవాలని సూచించారు. వినకుండా వారు ఆందోళన కొనసాగించడంతో పోలీసులు భారాస కార్యకర్తలను బయటకు పంపించారు. మేనేజర్‌తో మాట్లాడి వినతిపత్రం అందచేయాలని భూపాల్‌రెడ్డికి పోలీసులు సూచించినా ఆయన కమిషనర్ వచ్చే వరకు కదలనని చెప్పారు. ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పినట్లు పోలీసులు వింటున్నారని అసభ్య పదజాలం ప్రయోగిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయంలోనే తన ఛాంబరులో ఉన్న ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి తిట్టిన విషయం తెలుసుకుని వచ్చారు. అప్పటికే కొంత మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు, పార్టీ పట్టణ అధ్యక్షుడు మోహన్‌రెడ్డితో పాటు కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. కమిషనర్ ఛాంబరు ఎదుట ఇరు వర్గాలు ఎదురుపడటంతో పరిస్థితులు అదుపు తప్పాయి. దీంతో మాజీ ఎమ్మెల్యేతో పాటు ఇతర నాయకులను పోలీసులు అరెస్టు అక్కడి నుంచి నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మున్సిపల్ కార్యాలయంలో చోటు చేసుకున్న ఘటనపై మున్సిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్ సయ్యద్, సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. 'ఫ్లెక్సీల విషయంలో ఈ రోజు మధ్యాహ్నం భారాస నేతలు ఫోన్ చేశారు. ఆ సమయంలో కలెక్టర్‌తో పాటు వార్డు సభ కార్యక్రమంలో ఉండటంతో స్పందించలేకపోయాను. నేను లేని సమయంలో కార్యాలయంలో మేనేజరుకు, ఇన్‌వార్డులో ఫిర్యాదు చేసుకునే వెసులుబాటు ఉందని' కమిషనర్ తెలిపారు. అనుమతి లేకుండా ఛాంబరుకు వచ్చి మేనేజరు, సిస్టమ్ మేనేజర్‌పై అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు విధులకు ఆటంకం కలిగించారని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కంచర్ల భూపాల్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, దేవేందర్, మెరుగు గోపిలతో పాటు 20 మందిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై నాగరాజు తెలిపారు.

# తవ్వింది మట్టి.. లెక్కల్లో రాళ్లు!

కరీంనగర్ : మట్టిని రాయిగా చేయగలుగుతామా.. సాధ్యం కాదు.. కానీ గుత్తేదారులు తలుచుకుంటే నిజమేనని అనిపిస్తోంది.. లేని పనికి ఉన్నట్లుగా కనికట్టు చేసి 'తవ్వింది మట్టి.. లెక్కకు రాళ్లు'గానే రాయాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకటెండ్రు రూ.లక్షలు కాదు.. పాతిక లక్షలు బల్దియా సొమ్ము దండుకునేందుకు వ్యూహం రచించారు. కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని కశ్మీర్‌గడ్డ సమీకృత మార్కెట్ నిర్మాణ పనులను ఆరు నెలల కిందట ప్రారంభించారు. స్మార్ట్‌సిటీ కింద రూ.10 కోట్లు కేటాయించారు. మొదట పాత రేకుల షెడ్డు కూల్చివేశారు. ఆ తర్వాత కింది అంతస్తు కోసం భారీగా మట్టి తీశారు. పునాదులు తవ్వి ఫిల్లర్ల దశలో పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులు జరుగుతుండగా ఎప్పటికప్పుడు రికార్డు చేసుకోవడం తప్పనిసరి. నగరపాలక ఇంజినీరింగ్ అధికారులతోపాటు పీఎంసీ, గుత్తేదారుల తరఫున ఏజెన్సీ పర్యవేక్షణ చేసి ఏ పని ఎంత మంది జరిగిందే వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

**తవ్వితే చాలు.. అంచనాలు మారడమే..**

రెండేళ్ల కిందట వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభించగా ఆ సమయంలో అక్కడా తవ్వడం ప్రారంభించారు. కొంతమేర గుట్ట వచ్చినట్లుగా చెబుతుండగా దీనిని అంచనాలకు మించి రికార్డు చేసుకోవడం, ఎంబీ పుస్తకం ఇప్పటికీ దొరకకపోవడం చరిత్రగా మారింది. దీనిపై పలువురు విజిలెన్స్‌తో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. బిల్లులు రాకపోవడంతో తుది దశలో పనులకు ఆగిపోయాయి. ప్రస్తుతం కశ్మీర్‌గడ్డ మార్కెట్ పనుల కోసం తవ్వగా అదే పరిస్థితిలో వాస్తవ పరిస్థితిని పరిగణనలోకి తీసుకోకుండా బిల్లులు రికార్డు చేసుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మొదట్లోనే తొలగించిన రేకులు బల్దియాకు అప్పగించలేదని



తేలడంతో అప్పటి కమిషనర్ రికవరీ చేయించారు.

**గట్టి భూమి.. కాదు బండ..**

కశ్మీర్‌గడ్డ సమీకృత మార్కెట్ నిర్మాణం తవ్వే సమయంలో గట్టి భూమి(హార్డ్ సాయిల్) వచ్చింది. తవ్వడంలో కాస్తా అధిక సమయం పట్టడంతో సంబంధిత ఏజెన్సీ నిర్వాహకులు రాక్ కట్టింగ్ చేసినట్లుగా రాసుకున్నారు. సుమారు 200–300 క్యూబిక్ మీటర్లుగా నమోదు చేసుకున్నట్లు తెలుస్తోంది. దీనిని బిల్లుగా రికార్డు చేసుకునేందుకు కసరత్తు చేశారు. ఒకరిద్దరు అధికారులను కలిసి ఒప్పందం కుదుర్చుకున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇంకేముంది ఎంబీ రికార్డు చేయాలని మరో ఇద్దరు ఇంజినీరింగ్ అధికారులపై ఒత్తిడి పెంచారు. ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన ఉన్నతాధికారికి తెలియకుండా అప్పటి అధికారి సమయంలో పనులు జరిగాయని సంతకం చేయించేందుకు కూడా సిద్ధమయ్యారు. అయితే బిల్లులో ఏముందని పరిశీలిస్తే రాక్(రాయి) తొలగించినట్లుగా పేర్కొంటూ సుమారు రూ.22 లక్షలకు కాగితంపై రికార్డు చేశారు. అక్కడ రాయి ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పాలని పట్టుబడటంతో బెదిరింపులు మొదలయ్యాయి. అయినప్పటికీ ఎంబీలో గట్టి భూమి తప్ప రాయి అని రాసేదీ లేదంటూ తేల్చి చెబుతున్నట్లు సమాచారం.

**ఉదాసీనంగా ఉంటే రూ.లక్షలు స్వాహా**

గుత్తేదారులు రాసిందే లెక్క అన్నట్లుగా ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోకుండా ఉంటే కమీషన్ల చాటున అక్రమాలకు తావిచ్చినట్లుగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొందరు తిమ్మిని బమ్మిని చేస్తుండటం, అంచనాలకు మించి బిల్లులు రికార్డు చేయడంపై ఇటీవల తీవ్ర విమర్శలు వచ్చాయి. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి ఎంబీలు రికార్డు చేస్తే అక్రమాలకు కళ్లెం పడనుంది.

**అనుమానం వచ్చి తనిఖీకి ఆదేశించాం**

అలాంటిది ఏమి లేదు. సదరు ఏఈకి అనుమానం రావడంతో సమగ్రంగా తనిఖీ చేయాలని ఆదేశించాం. కాగితంపై రికార్డు చేసుకున్నారు. ఎంబీ రికార్డు కాలేదు. స్మార్ట్‌సిటీ ఏజెన్సీ దగ్గర అన్ని వివరాలు ఉన్నాయి. పూర్తి స్థాయి పరిశీలన ఉంటుంది. చాహత్ బాజ్‌పాయ్, కమిషనర్, కరీంనగర్ నగరపాలిక

# ఉర్సుకు వేళాయె..!

నేరేడుచర్ల : జాన్‌పహాడ్ దర్గా ఉర్సును ఈ నెల 23, 24, 25 తేదీల్లో నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. 23 తెల్లవారుజామున 3 నుంచి 5 గంటల మధ్య గుసూల్ ఏ షరీఫ్ అనంతరం గంధంతో అలంకరణ, కొత్త దట్టీల ఏర్పాటు, పూల అలంకరణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 24న జరిగే కీలక ఘట్టమైన గంధం ఊరేగింపులో గుర్రం ప్రధాన ఆకర్షణ. హైదరాబాద్ నుంచి తెచ్చిన గంధం, ముజావర్ ఇంటివద్ద నుంచి తెచ్చిన గంధాన్ని ఊరేగింపుగా సాండల్ ఖానా వద్దకు తీసుకువచ్చి ప్రార్థనల అనంతరం భారీ పోలీసు బందోబస్తుతో ఊరేగింపుగా జాన్‌పహాడ్ కల్మెడతండా, చెర్వుతండాల దాకా, మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో దర్గాకి తీసుకువస్తారు. 25న దీపారాధనతో ఉత్సవాలు ముగుస్తాయి. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ సయ్యద్ హజ్మతుల్లా హుస్సేని హాజరయ్యే అవకాశం ఉంది.

**ప్రతి శుక్రవారం వేల సంఖ్యలో భక్తులు** సయ్యద్ మొహియిద్దీన్‌షా ఉరఫ్ జాన్‌పాక్ షహీద్ ఇస్లాం మతవ్యాప్తి చేస్తూ ఇక్కడ అమరుడయ్యాడని చెబుతారు. అతడితో పాటు అతడి అనుచరుల సమాధులు సైతం దర్గా లోపల, పక్కన దర్శనమిస్తాయి. దర్గా పరిసరాల్లోని సఫాయి బావి నీరు పవిత్రమైందిగా భావించి ఆ నీటితో స్నానాలు చేయడానికి భక్తులు ఇష్టపడతారు. పిల్లలు లేని వారు జాన్‌పహాడ్ సైదులుకి మొక్కి, సంతానం కలిగిన తర్వాత ఆయన పేరే పెడుతుంటారు. ప్రతి శుక్రవారం వేల సంఖ్యలో భక్తులు వచ్చి తలనీలాలు సమర్పించి, మొక్కులు చెల్లిస్తారు. ఉర్సు నిర్వహణకు ఈ ఏడాది రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ రూ.30 లక్షలు విడుదల చేశారు. దీనికి తోడు మంత్రి రూ.1.14 కోట్లు అభివృద్ధి పనుల కోసం మంజూరు చేయడంతో దర్గా ఆవరణలో, మసీదు ప్రాంతంలో పనులు చేపట్టారు. పోలీసు శాఖ 500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తోంది. నిఘా కోసం దర్గా వద్ద 16 సీసీ కెమెరాలు ఉండగా మరో 20 ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మీనర్సయ్య తెలిపారు. నేరేడుచర్ల మీదుగా భక్తుల రద్దీని బట్టి కోదాడ డిపో నుంచి 15–20, సూర్యాపేట డిపో నుంచి 3 బస్సులు నడుపుతామని కోదాడ డిపో మేనేజర్ శ్రీహర్ష తెలిపారు. మిర్యాలగూడ డిపో నుంచి దామరచర్ల మీదుగా 15–20 బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

# ఎవరు చూడొచ్చారులే..!

పెద్దేముల్ : దాదాపు 20 ఏళ్లుగా అంగన్‌వాడీ కేంద్రాలు కనీస సౌకర్యాల లేమితో అవస్థలు పడుతున్నాయి. ఎన్నో ప్రతిపాదనలు, అంచనాల తర్వాత ప్రభుత్వం గతేడాది సెప్టెంబరులో ఒక్కో అంగన్‌వాడీకి రూ. 16,000 కేటాయించింది. రాకరాక వచ్చిన నిధులతో పనులు నాణ్యతగా చేయాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. 'ఎవరొచ్చి చూస్తారులే' అన్న విధంగా సాగుతున్నాయి.

**జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో..:** కలెక్టర్‌గా ప్రతీక్ జైన్ జిల్లాకు వచ్చిన తర్వాత పలు అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. వసతి సౌకర్యాలు లేక చిన్నారులు, బాలింతలు, గర్భిణిలు పడుతున్న కష్టాలను గుర్తించారు. కేంద్రాలను తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో నిధులు మంజూరు చేసి పనుల బాధ్యతను ఎంపీడీవోలకు అప్పగించారు. అయితే క్షేత్రస్థాయిలో రంగులు వేయడానికి గంపగుత్తగా పనులు అప్పగించారు. కొన్ని చోట్ల గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఇచ్చేశారు. రూ. 4 వేలు ఇచ్చి స్థానిక అంగన్‌వాడీ టీచర్లతో చేయించారు.



**ఇవిగో ఉదాహరణలు**

పెద్దేముల్ మండలం బండమీదిపల్లిలో అంగన్‌వాడీ కేంద్రానికి బయట రంగులు వేసి లోపల వదిలేశారు. చిన్న చిన్న పనులు చేసి లెక్కల్లో మాత్రం నిధులు మొత్తం ఖర్చు చేసినట్లు చూపించారు.

తట్టేపల్లిలో రెండు అంగన్‌వాడీ కేంద్రాల ముందు భాగంలో రంగులు వేసి నేమ్ బోర్డులు రాశారు. ఇతర పనులేమీ చేయలేదు. నిధులు మాత్రం అయిపోయాయి.

పాషాపూరులో మరుగుదొడ్డి నిర్మాణానికి గుంత తవ్వి వదిలేశారు. కిచెన్ కట్ట కోసం రూ. 5 వేలు మంజూరయ్యాయి. స్థానిక అధికారుల సూచనతో అంగన్‌వాడీ టీచర్ కిచెన్ ప్లాట్‌ఫాం కట్టించారు. ఇప్పటి వరకు ఆమెకు డబ్బుల చెల్లింపు జరగలేదు.

బుద్దారంలో సగం పనులు చేసి వదిలేశారు. స్థానికులు ప్రశ్నించడంతో దిద్దుబాటు చర్యలు చేపట్టారు.

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు

మొత్తం: 1,106

7 నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లలు: 32,583

3 సంవత్సరాల నుంచి 6 లోపు చిన్నారులు: 18,880

గర్భిణులు: 6,258

బాలింతలు: 5,379

**పర్యవేక్షణ కొనసాగుతోంది: శ్రీలక్ష్మి, ఏసీడీపీఓ, తాండూరు**

అంగన్‌వాడీల్లో సూపర్‌వైజర్లతో పర్యవేక్షణ కొనసాగుతోంది. పనులు సరిగ్గా జరగని కేంద్రాల వివరాలను ఎప్పటికప్పుడు జిల్లా అధికారులకు నివేదిస్తున్నాం. వారి సూచనల మేరకు చర్యలు చేపడుతున్నాం.

# స్టడీ హాళ్లు ఎందుకు.. సిటీ సెంట్రల్ లైబ్రరీ ఉండగా

హైదరాబాద్ : నగరంలో ప్రముఖ గ్రంథాలయాల్లో సిటీ సెంట్రల్ లైబ్రరీ ఒకటి. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువత నిత్యం పెద్దసంఖ్యలో ఇక్కడకు వస్తుంటారు. గ్రంథాలయంలో పుస్తకాలు, గ్రంథాలయ సంస్థ ఉచితంగా కల్పించే సౌకర్యాలపై అవగాహన లేక చాలామంది ఉద్యోగార్థులు అద్దె చెల్లిస్తూ స్టడీ హాళ్లను ఆశ్రయిస్తున్నారు. ఉద్యోగార్థుల కోసమే కాకుండా వృద్ధులు, చిన్న పిల్లలకు సైతం ఇక్కడ ప్రత్యేక విభాగాలున్నాయి. సుమారు 2.40 లక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.

**అంతర్జాల సదుపాయం..** యువతీయువకులు ఉద్యోగ నోటిఫికేషన్లు చూసుకోవడానికి, వాటికి దరఖాస్తు చేసుకోవడానికి సిటీ సెంట్రల్ లైబ్రరీలో 25 కంప్యూటర్లున్నాయి. సోమవారం, రెండో శనివారం మినహా అన్నిరోజుల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు గుర్తింపు కార్డు చూపించి వాడుకోవచ్చు. గంటకు రూ. 5 చెల్లించాలి. : పోటీ పరీక్షల కేంద్రాలు నిర్వహించే ఆన్‌లైన్ క్లాసులు వినేందుకు ఉచిత హైస్పీడ్ వైఫై కూడా ఉంది.

**రూ.150తో సభ్యత్వం..** పుస్తకాలు అక్కడే ఉండి చదువుకోవడమే కాకుండా ఇంటికి తీసుకెళ్లి చదివే వెసులుబాటు ఉంటుంది. అందుకు రూ. 150 చెల్లించి సభ్యత్వం తీసుకోవాలి. రూ. 1,250 విలువ గల పోటీ పరీక్షల పుస్తకాలనూ తీసుకెళ్లి ఇంటి దగ్గరే సన్నద్ధమవొచ్చు.

**పుస్తక భాండాగారం..** ఇక్కడ మాస, వార పత్రికలు అందుబాటులో ఉన్నాయి. తత్వశాస్త్ర పుస్తకాలు, నవలలు, జీవిత చరిత్రలు, చారిత్రక, ఆధ్యాత్మిక గ్రంథాలు, వేదాలు, శాస్త్రసాంకేతిక పుస్తకాలు ఇక్కడ ఉన్నాయి. 8 భాషల దినపత్రికలు చదువుకోవచ్చు. మహిళలు, వృద్ధులు, చిన్నారులకు కేటాయించిన ప్రత్యేక ప్రదేశాల్లో ఆయా విభాగాల వారికి అవసరమైన పుస్తకాలున్నాయి.

# కరవు నేలకు.. గోదావరి జలకళ

ఆలేరు : ఆలేరు పెద్దవాగు గోదావరి జలకళ సంతరించుకుంటోంది. పది రోజుల క్రితం మల్లన్నసాగర్ నుంచి బస్వాపూర్ ప్రాజెక్టులోకి వెళ్లే కాలువ నీటిలో కొంత భాగాన్ని సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం పీర్లపల్లి వద్ద కాలువ ద్వారా తుర్కపల్లి మండలం గంధమల్ల చెరువులోకి వదిలారు. వారం రోజులుగా గంధమల్ల చెరువు అలుగు పోస్తుంది. అలుగు ప్రాంతం ఆలేరు వాగుకు అనుసంధానంగా ఉండటంతో ఆలేరు వాగులో గోదావరి జలాలు ప్రవహిస్తున్నాయి. ఫలితంగా వాగు పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం పెరుగుతోంది. వ్యవసాయ బావులు, బోర్ల నీటి ఊటలు పెరుగుతున్నాయి. ఈ ఏడాది సరైన వర్షాలు లేక భూగర్భ జలమట్టం పడిపోతోంది. వ్యవసాయ బావులు, బోర్లు ఎత్తిపోతున్నాయి. తాగునీటి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ నెలాఖరు వరకు గంధమల్ల చెరువు అలుగును పారించాలని ప్రభుత్వం ఆదేశించింది. గంధమల్ల చెరువు కింది భాగమైన రాజపేట మండలం బేగంపేట నుంచి గుండాల మండలం వరకు ఉన్న ఆలేరు(బిక్కేరు) వాగులో వివిధ చోట్ల వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్‌లు నీటితో నిండనున్నాయి. నీటి ప్రవాహం ఆలేరు పట్టణ శివారుకు చేరింది. యాసంగి పంటలకు నీటి కొరత ఉండదని, తాగునీటి సమస్య తలెత్తదని అధికారులు అంటున్నారు.

# అర్హులమైనా ఎంపిక చేయరా!



పెద్దపల్లి : నాలుగు సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న గ్రామసభలతో ఊరూరా సందడి నెలకొంది. ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల లబ్ధిదారుల జాబితాలో పేర్లు గల్లంతు కావడంపై పలు చోట్ల ఆందోళనకు దిగుతున్నారు. ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న తమకు నిరాశే మిగిలిందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే పదుల సంఖ్యలో అర్జీలు ఇచ్చామని, మళ్లీ దరఖాస్తు ఎలా చేసుకుంటామంటూ ప్రశ్నించారు. బాధితులు తిరిగి దరఖాస్తు చేసుకునేందుకు జిరాక్సు కేంద్రాలకు పరుగు తీస్తున్నారు.

**పట్టణాలకేదీ ఆత్మీయ భరోసా!**

జిల్లాలోని రామగుండం నగరపాలకసంస్థ, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీల్లో భూమి లేని నిరుపేదలకు ఆత్మీయ భరోసా సాయం దూరం కానుంది. ఉపాధిహామీ జాబ్‌కార్డులు కలిగి ఉండి, పనులు చేసిన రోజులను పథకానికి ప్రామాణికంగా తీసుకుంటున్నారు. మున్సిపాలిటీల్లో ఉపాధిహామీ పథకం అమలులో లేకపోవడంతో 'మా సంగతి ఏమిట'ని పేదలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 266 పంచాయతీల్లో ఉపాధిహామీలో భాగంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో 20 రోజుల కంటే ఎక్కువగా పని చేసిన కుటుంబాలు 15,043 ఉండగా గ్రామసభల్లో పేర్లు చదువుతున్నారు. అర్హులై ఉండీ జాబితాల్లో పేర్లు లేని వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

**కుప్పలుగా దరఖాస్తులు**

తొలి రోజు గ్రామ సభలకు ప్రజలు భారీగా తరలివచ్చారు. నాలుగు పథకాల జాబితాలో పేర్లు లేని వారు అధికారుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాపాలన, సామాజిక, ఆర్థిక సర్వేలో దరఖాస్తు చేసినా తమ పేర్లు ఎందుకు రాలేదంటూ ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఆత్మీయ భరోసాపై కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు వచ్చాయి. పూరి గుడిసెలో ఉంటున్నా తమ పేర్లు లేవని సుల్తానాబాద్ మార్కండేయకాలనీకి చెందిన పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. జాబితాలో రాని వారు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నా ప్రజలు వినిపించుకోవడం లేదు.

**50 రోజులు పని చేసినా రాలే!**

మాకు గుంట భూమి లేదు. కూలీ పని చేస్తూ బతుకీడుస్తున్నాం. ఉపాధిహామీలో 2023-24లో యాభై రోజులు పనికి వెళ్లా. ఆత్మీయ భరోసాలో సాయం కోసం దరఖాస్తు చేసుకున్నా జాబితాలో పేరు రాలేదు.

దేవరకొండ విజయ, సూరయ్యపల్లి, మంథని మండలం

గూడు గోడు వినండి సారూ

మాది నిరుపేద కుటుంబం. దివ్యాంగుడిని. ఏం పని చేసుకునే పరిస్థితి లేదు. సొంతింటి కోసం దరఖాస్తు చేసినా జాబితాలో పేరు రాలేదు. మాలాంటి వారికి ప్రభుత్వం గూడు వసతి కల్పించాలి.

దాసరి రాజలింగు, సుందిళ్ల, రామగిరి మండలం

# ఎత్తిపోత పనులు ముందుకు సాగేనా?



ధర్మపురి: ధర్మపురితోపాటు చుట్టుపక్కల పల్లెల్లో సాగు, తాగు నీటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రతిపాదించిన అక్కపల్లి ఎత్తిపోతల పథకం పనులు నిలిచిపోయాయి. గోదావరి నీటిని అక్కపల్లి చెరువులోకి ఎత్తిపోయడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. ఈ పథకానికి గత ప్రభుత్వంలో అడుగులు పడినా చివరికి ఎన్నికలు రావడంతో అర్ధాంతరంగా నిలిచిపోయింది. బావిని తోడారు కానీ.. మిగతా పనులకు మోక్షం కలగడం లేదు. ఈ ఎత్తిపోతల పథకం రీడిజైనింగ్ కోసం మళ్లీ ప్రతిపాదనలు పంపినా స్పందన లేదు.

**అన్నదాతల్లో ఆందోళన**

అక్కపల్లి చెరువు ద్వారా నీరందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ చెరువును రిజర్వాయిర్‌గా మార్చినా సాగు నీరు అందడం లేదని ధర్మపురితోపాటు, నర్సయ్యపల్లె, కోరండ్లపల్లె, కొత్తకోరండ్లపల్లె, బుద్దేశ్‌పల్లి, తుమ్మెనాల, నాగారం, కమలాపూర్ ప్రాంత రైతులు చెబుతున్నారు. వర్షాలు పడితే చెరువు నిండా నీరు నిలవడం.. కొన్ని రోజులకే ఖాళీ అవడంతో వ్యవసాయ మానేసి ఉపాధి నిమిత్తం వలసలు వెళ్లాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయని వాపోతున్నారు. ఈ ఎత్తిపోతల పథకం పూర్తయితే పుష్కలంగా సాగు నీరందుతుందని, యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని కోరుతున్నారు. మరోవైపు చెరువు చుట్టూ పొడవునా కట్టను ఆధునికీకరించారు. ఆయకట్టుకు నీరందించేలా కాలువలను రూపొందించారు. గత వేసవిలో చెరువులో నీరు నిలిచేలా పూడిక తీయించారు. ఇంకా కొద్దిపాటి పనులు పెండింగులో ఉన్నాయని, వాటిని కూడా పూర్తి చేస్తే మేలు కలుగుతుందని అన్నదాతలు కోరుతున్నారు.

**కేవలం అయిదు శాతమే..**

ఎత్తిపోతల పథకానికి రూ. 60.90 కోట్ల నిధులు మంజూరు చేయగా, పనులు ప్రారంభించి వదిలేశారు. కేవలం అయిదు శాతం పనులు మాత్రమే పూర్తవడం పరిస్థితికి అద్దం పడుతోంది.

గోదావరి నది నుంచి కిలోమీటరు దూరం వద్ద నీటిని నిలువ చేసే లక్ష్యంతో పెద్ద బావిని తవ్వారు. పైపులైను ఏర్పాటు చేసి అక్కపల్లి చెరువులోకి నీటిని పంపించేలా కాలువలను నిర్మించాల్సి ఉంది.

ఎన్నికల తరువాత ఉన్నతాధికారులు పరిశీలించి డిజైనింగ్‌లో స్వల్ప మార్పులతో ప్రతిపాదించగా మోక్షం కలగడం లేదు. ఇరిగేషన్ అధికారులు అనుమతులు ఇస్తేనే ప్రారంభమయ్యే అవకాశముంది. అక్కపల్లి చెరువులో నిత్యం 0.15 టీఎంసీల నీరు నిల్వ ఉంచేలా అధికారులు స్థిరీకరించారు. ఈ పనులు పూర్తయితే ధర్మపురి పట్టణంతోపాటు, పలు గ్రామాలకు తాగు, సాగు నీటి సమస్యలు పరిష్కరించే అవకాశముందని, డిజైనింగ్ అనుమతులు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

రీడిజైనింగ్‌లో మార్పులు కోరుతూ ప్రతిపాదించామని, అనుమతులు రాగానే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ధర్మపురి ఎస్సారెస్పీ డివిజన్ ఈఈ నారాయణరెడ్డి పేర్కొన్నారు.

**పనులు చేపట్టాలి**

అక్కపల్లి ఎత్తిపోతల పనులు పూర్తయితే ఆయకట్టులో రెండు పంటలకు నీరందుతుంది. పనులను వదిలేయడం సరికాదు. వేసవిలోపు పూర్తిచేసేలా ప్రజాప్రతినిధులు, అధికారులు తగిన చొరవ చూపాలి.

కిషన్, రైతు, ధర్మపురి


# కలగానే మిరప మార్కెట్ యార్డు

భానుపురి : సూర్యాపేట జిల్లాలో మిరప మార్కెట్ యార్డు ఏర్పాటు కలగానే మారింది. ఏళ్ల నుంచి రైతులు ఎదురుచూస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరూ ముందుకురావటం లేదు. పండించిన పంటను స్థానికంగా అమ్ముకొనే భాగ్యం కలగక అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఏళ్ల తరబడి ఇతర ప్రాంతాల్లో విక్రయించాల్సిన దుస్థితి నెలకొంది. వ్యవసాయ మార్కెట్ యార్డులున్నా.. మిరప యార్డు ఏర్పాటుపై చర్యలు తీసుకోవటం లేదు. దూరభారంతో అన్నదాతలు గిట్టుబాటు కాక నష్టపోతున్నారు.

**ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి వ్యయప్రయాస**

జిల్లాలో ఈసారి 14,915 వేల ఎకరాల్లో 9,809 మంది రైతులు మిరప పంటను సాగు చేశారు. మేళ్లచెరువు, మోతె మండలంలో ఎక్కువ విస్తీర్ణంలో సాగైంది. మిగతా ప్రాంతాల్లో కొద్దిపాటి కమతాల్లో పండిస్తారు. నూర్పిడికి వచ్చిన పంటను ఖమ్మం, గుంటూరు తదితర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు. దూరభారం కావడంతోపాటు రవాణా ఖర్చులతో కర్షకులు నష్టపోతున్నారు. కూలీలు, రవాణా ఖర్చులుపోను మిగిలే పరిస్థితి లేకుండా పోతోంది. పలుమార్లు అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవటం లేదు. ఇతర ప్రాంతాల్లో మిరపను విక్రయించేందుకు రెండుమూడురోజుల వరకు సమయం పడుతుండటంతో వాహనానికి మూడురోజుల కిరాయి ఇవ్వాల్సిన వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

**ఏటా ఖమ్మం వెళ్తున్నాం**



ఉప్పలయ్య, మిరప రైతు, మాచనపల్లి(నూతనకల్)

జిల్లాలో మిరప మార్కెట్ లేక ఖమ్మంలో విక్రయిస్తున్నాం. ఇందుకు రెండురోజులు సమయం పడుతోంది. ఖమ్మం జిల్లాలో ఎక్కువగా మిరప పండిస్తుంటారు. దీంతో కాంటాలకు రోజుల తరబడి సమయం పడుతోంది. రవాణా, కూలీల ఖర్చులు పెరిగి గిట్టుబాటు కావటం లేదు. ఇప్పటికైనా జిల్లాలో మిరప యార్డు ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

అన్వేషణ చేస్తున్నాం.నాగేశ్వరశర్మ, జిల్లా మార్కెట్ అధికారి, సూర్యాపేట

జిల్లాలో మిరప యార్డు ఏర్పాటు విషయమై అనువైన స్థలం కోసం అన్వేషణ చేపడుతున్నాం. గుర్తించిన వెంటనే రైతులకు ఇబ్బందులు కలగకుండా యార్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

# రూ.కోట్లలో ఆదాయం.. నిర్వహణలో నిర్లక్ష్యం

హైదరాబాద్ : ఇది రెడ్‌హిల్స్‌లోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం. ఇక్కడే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. నిత్యం ఎంతోమంది స్థిరాస్తుల, వివాహ రిజిస్ట్రేషన్లకు, భూముల ఈసీలు తీసుకునేందుకు వస్తుంటారు. విద్యుత్తు లేక వరకు రిజిస్ట్రేషన్ సేవలు ఆగిపోయాయి. కార్యాలయం మూడు గంటల పాటూ అంధకారంలో ఉంది. ఇన్వర్టర్లు పనిచేయలేదు.

**కరెంట్ కట్.. సేవలూ..:** నగరంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కనీస వసతులు కరవయ్యాయి. సర్కారుకి ఏటా రూ.కోట్లలోనే ఆదాయాన్ని తెచ్చి పెడుతున్నా సౌకర్యాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. రెడ్‌హిల్స్ ప్రాంతంలో 10 గంటల నుంచి 1గంట వరకు చెట్ల కొమ్మల నరికివేతకు కరెంట్ సరఫరాని నిలిపేశారు. దీంతో ఉదయం కార్యాలయం ప్రారంభమైనా మధ్యాహ్నం కరెంట్




వచ్చేవరకు సేవలు మొదలుకాలేదు. ఇది ఒక్క రెడ్‌హిల్స్‌లోనే కాదు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఉన్న పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ కరెంట్ ఎక్కువసేపు పోతే ఇదే పరిస్థితి.

**అరగంటకు మించితే అంతే...**

కార్యాలయాల్లో ఉన్న బ్యాటరీ బ్యాకప్ అరగంటకు మించి రాదని మూసాపేటలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగి తెలిపారు. ఒకవేళ కరెంట్ పోయినా.. అరగంటకు మించదనే ఉద్దేశంతో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు ఉన్నారు. ఇవే కార్యాలయాల బయట ఏజెంట్ల దుకాణాల్లో జనరేటర్లు, ఇన్వర్టర్లతో సేవలందిస్తుంటే.. కార్యాలయంలో మాత్రం కరెంట్ లేదని సిబ్బంది ఖాళీగా కూర్చుంటున్నారు.

**ముగిసిన ఒప్పందం:** సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇన్వర్టర్ల నిర్వహణను ఇదివరకు ఓ సంస్థకు అప్పగించారు. ఆ గడువు రెండేళ్ల క్రితమే ముగిసిందని.. అప్పటి నుంచి కరెంట్‌పోతే సేవలు పూర్తిగా నిలిచిపోతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. మంత్రి ఆదేశించినా...: సంబంధిత శాఖ మంత్రి ఇటీవల అధికారులతో సమావేశం నిర్వహించి సేవల పరంగా ప్రజలకు ఎలాంటి లోపాలకు తావు లేకుండా చూడాలని ఆదేశించినా.. అధికారుల్లో మాత్రం చలనం లేదు.

# కి.మీ.రోడ్డుకు.. రూ.3.35 కోట్లు హైదరాబాద్

హైదరాబాద్ : సీఆర్ఎంపీ-2 (రహదారుల సమగ్ర నిర్వహణ కార్యక్రమం) పేరుతో జీహెచ్ఎంసీ రాబోయే ఐదేళ్లకు 1,142.54 కి.మీ రోడ్లకు రూ. 3,825 కోట్లను వెచ్చించేందుకు సిద్ధమైంది. అంటే.. సగటున కిలోమీటరు రోడ్డు నిర్వహణకు రూ. 3.35కోట్లు వెచ్చించబోతోంది. ఐదేళ్ల కిందట సీఆర్ఎంపీ-1 ప్రాజెక్టు మొదలైనప్పుడు ఈసగటు వ్యయం రూ. 2.59 కోట్లు ఉండగా.. తాజా గా రూ. 3.35 కోట్ల కు చేరుకుంది. రాబోయే ఐదేళ్లు పూర్తయ్యే నాటికి ఆ సగటు వ్యయం రూ. 4.5కోట్లకు చేరొచ్చనే అంచనాలు వినిపిస్తున్నాయి. మరోవైపు.. మొదటి దశలో పునర్ నిర్మించిన వందలాది కిలోమీటర్ల రోడ్లనే.. రెండో దశలోనూ కొనసాగించడం అనుమానాలకు తావిస్తోంది. కొన్నేళ్లుగా నిర్మాణానికి నోచుకోకుండా.. గుంతలతో ప్రజలను ఇబ్బందిపెట్టే అంతర్గత రోడ్లను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు. బాగున్న రోడ్లపైనే వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చిస్తామంటూ ఇంజినీర్లు ప్రతిపాదనలు సిద్ధం చేసి.. ఆమోదించాలంటూ స్థాయీ సంఘానికి పంపడంపై ఆరోపణలొస్తున్నాయి.

**సీఆర్ఎంపీ-1లో..**

2020లో సీఆర్ఎంపీ-1 మొదలైంది. ఏడు ప్యాకేజీలుగా 709కి.మీ రోడ్లను రూ. 1,839కోట్లతో ఐదేళ్లపాటు నిర్వహించాలని జీహెచ్ఎంసీ పనులు అప్పగించింది. ఈ క్రమంలో మరికొన్ని రోడ్లను చేర్చడంతో జీహెచ్ఎంసీ రూ. 2,491కోట్లు వెచ్చించింది. మొదటి దశ పూర్తవడంతో.. 2025-2030 కాలానికి రెండో దశకు ఇంజినీర్లు ప్రతిపాదనలు రూపొందించారు.

**పాత రోడ్లనే..**సీఆర్ఎంపీ-1లో సీసీ రోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణం జరిగింది. ఆయా రోడ్లకు, మరో 398.32కి.మీ రోడ్లను కలిపి మొత్తం 1,142.54 కి.మీ రోడ్లకు సీఆర్ఎంపీ-2 ప్రతిపాదించారు. అవసరమైనచోట వరదనీటి కాలువలను నిర్మించి, నిర్వహించడం, ప్రధాన దారుల్లోని వరదనీటి కాలువలు, మ్యాన్‌హోళ్ల నిర్వహణ రెండోదశలో భాగమని ఇంజినీర్లు చెబుతున్నారు.

# హైదరాబాద్‌లో రేషన్‌కార్డులు ఆలస్యం

హైదరాబాద్ : రాజధానిలో రేషన్‌కార్డుల మంజూరులో జాప్యం చోటుచేసుకుంటోంది. జిల్లాల్లో మాదిరే.. గణతంత్ర దినోత్సవం రోజున నగరంలో రేషన్‌కార్డులను జారీ చేయాలని మొదట సర్కారు భావించింది. అందులో భాగంగా ఇటీవల కులగణన సర్వేలో కార్డు కోసం అర్జీ పెట్టుకున్న 83వేల మంది అర్హతల పరిశీలనను పూర్తి చేసింది. అయితే ఇటీవల ప్రజాభవన్‌కు, జిల్లా కలెక్టర్ కార్యాలయాలకు సుమారు లక్షమంది కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ముందుగా నిర్ణయించినట్లు జనవరి 26న రేషన్‌కార్డులను జారీ చేస్తే.. వారంతా అసంతృప్తికి గురవుతారని సర్కారు పునరాలోచనలో పడింది.

కొంత జాప్యం చోటుచేసుకున్నప్పటికీ.. అందరికీ న్యాయం చేయాలని ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం స్పష్టం చేశారు. ప్రజాపాలన సభలు, మీసేవా కేంద్రాలకు అందిన దరఖాస్తులనూ పరిగణనలోకి తీసుకొని అర్హులను గుర్తించాలని ఆదేశించారు. అర్హుల పరిశీలన మరో వారం కొనసాగుతుందని, ఫిబ్రవరి మొదటి వారంలో వార్డు సభలు నిర్వహించి, లబ్ధిదారులను ఎంపిక చేస్తామని అధికారులు చెబుతున్నారు. 90శాతం అర్హులే..: ప్రభుత్వం ఇటీవల సామాజిక, ఆర్థిక సర్వే(కులగణన)ను పూర్తి చేసింది. అందులో భాగంగా 83వేల కుటుంబాలు అర్జీ పెట్టుకున్నాయి.

# మెట్రో విస్తరణకు త'రుణం.. కేంద్రం అనుమతే కీలకం'

హైదరాబాద్ : మెట్రోరైలు రెండోదశకు నిధుల లభ్యత పెద్ద సమస్య కాదంటోంది హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు సంస్థ (హెచ్ఏఎంల్). ప్రాజెక్ట్‌కు కేంద్రం అనుమతి ఇస్తే అంతర్జాతీయ బ్యాంకింగ్ సంస్థలు నిధుల మంజూరుకు సుముఖంగా ఉన్నాయని మెట్రో వర్గాలు అంటున్నాయి. 2 కంటే తక్కువ శాతానికే రుణం మంజూరు చేయడంతోపాటు పదేళ్ల మారటోరియం, 30 ఏళ్లపాటు చెల్లింపులకు అవకాశం ఉండటంతో ప్రాజెక్ట్ ఆరంభమైన మొదటిరోజు నుంచే లాభాల్లో నడిచే ఆస్కారం ఉంటుందని హెచ్ఏఎంల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి అన్నారు.

**పదేళ్లదాకా వెసులుబాటు**

జైకా వంటి సంస్థలు ప్రభుత్వ ప్రాజెక్ట్‌లకు ఇచ్చే రుణాలపై పదేళ్లపాటు మారటోరియం ఉంటుంది. అంటే రుణం పదేళ్ల వరకు చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఆ తర్వాత 30 ఏళ్లపాటు చెల్లిస్తే సరిపోతుంది. అప్పటికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎన్నోరెట్లు పెరుగుతుంది. కాబట్టి తిరిగి




చెల్లింపులు పెద్ద భారం కావు అనేది మెట్రో వర్గాల మాట.

**రుణాలు ఎవరిస్తారంటే..**

మెట్రోరైలు రెండోదశలో 76.4 కి.మీ. మార్గానికి రూ.24,269 కోట్ల అంచనాలతో సమగ్ర ప్రాజెక్ట్ నివేదికలు రూపొందించి ప్రభుత్వం కేంద్రానికి పంపింది. కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతో చేపట్టేలా ప్రతిపాదించారు. ప్రాజెక్ట్ వ్యయంలో ఈక్విటీలో 30 శాతం రాష్ట్రం, 18 శాతం కేంద్రం భరించేలా ప్రతిపాదించారు. మిగిలిన దాంట్లో 48 శాతం అంటే రూ.11,693 కోట్లు రుణాల ద్వారా సమకూర్చుకోవాలనేది ప్రణాళిక. ఇంతపెద్ద మొత్తం రుణం తక్కువ వడ్డీకి తీసుకోవాలంటే అంతర్జాతీయ బ్యాంకులు జైకా, ఏడీబీ, ఎన్‌డీబీ వంటివైతేనే సాధ్యం. పలు అంతర్జాతీయ బ్యాంకులు నిధులు ఇచ్చేందుకు సానుకూలంగా ఉన్నట్లు హెచ్ఏఎంఎల్ అధికారులు తెలిపారు. కేంద్రం సావరిన్ గ్యారంటీ ఇవ్వాలి. ఏ బ్యాంకు నుంచి ఎంత రుణం తీసుకోవాలో కూడా కేంద్రమే నిర్ణయిస్తుంది. మిగిలిన 2 శాతం ప్రాజెక్టు వ్యయాన్ని పీపీపీ ద్వారా సేకరిస్తారు.

# కూల్చేటివి.. కూల్చనివి


హైదరాబాద్ : చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూములు, పార్కుల సంరక్షణ కోసం ఈ ఏడాది జులై 19న రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసింది. ఇప్పుడు ఆ తేదీనే అక్రమ నిర్మాణాలు, ఆక్రమణల భవిష్యత్తును నిర్ణయిస్తోంది. జులై నెలకు ముందు కట్టిన వినియోగంలోని ఇళ్లను కూల్చబోమని, తర్వాత కట్టిన నిర్మాణాలను కూల్చుతామని కమిషనర్ ఎ.వి.రంగనాథ్ ఇప్పటికే ప్రకటించారు. దీనిపై హైడ్రా తీసుకున్న విధానపర నిర్ణయాలను వివరిస్తూ బుధవారం ప్రకటన విడుదల చేశారు.

**వీటిని కూల్చుతాం..**రద్దయిన అనుమతులు చూపుతూ జులై తర్వాత నిర్మాణ పనులు కొనసాగిన ఇళ్లను కూల్చుతాం. ప్రభుత్వ భూములను ఆక్రమించి పేదలకు విక్రయిస్తున్న ఆక్రమణదారులపై కఠిన చర్యలుంటాయి. ఎలాంటి నిర్మాణమైనా, ఏ దశలో ఉన్నా.. కోర్టు నుంచి కూల్చివేత ఆదేశాలు వచ్చినప్పుడు ఆగేది లేదు.

హైడ్రా ఏర్పాటయ్యాక చెరువుల్లో చేపట్టిన నిర్మాణాలను కూల్చడంతో పాటు అనుమతి ఇచ్చిన అధికారిపై కేసు నమోదు చేస్తాం.


ఎలా గుర్తిస్తామంటే.. క్షేత్రస్థాయి పరిశీలన, గూగుల్ ఎర్త్ పటాలతో నిర్మాణం జులై నాటికి పూర్తయిందా, లేదో ప్రాథమికంగా గుర్తిస్తాం. లైడార్ సర్వే, రిమోట్ సెన్సింగ్ సర్వేలతో భూముల పటాలను పరిశీలిస్తూ సెన్సార్ల సాయంతో ఆక్రమణలను గుర్తించేందుకు జాతీయ రిమోట్ సెన్సింగ్ కేంద్రంతో ఒప్పందం చేసుకుంటున్నాం. పునరుజ్జీవానికి ప్రతిపాదనలు: ఇప్పటికే కూల్చివేతలు పూర్తయిన 12 చెరువులకు పునరుజ్జీవం కల్పించే ప్రతిపాదనలను పంపాం. 200 ఎకరాల భూమిని ఆక్రమణల విడిపించాం. 5వేల ఫిర్యాదులు విచారణలో ఉన్నాయి.

# ఉదయమే గిర్రుమంటోంది



హైదరాబాద్: విద్యుత్తు డిమాండ్ సాధారణంగా లైటింగ్ లోడ్ అధికంగా ఉండే సాయంత్రం వేళల్లో నమోదవుతుంది. చలికాలంలో నగరంలో ఇందుకు భిన్నంగా ఉదయం పూట గరిష్ఠంగా ఉంటోంది. ఆ సమయంలో పిల్లలు పాఠశాలలకు, పెద్దలు కార్యాలయాలకు వెళ్లేందుకు సిద్ధమవుతుంటారు. ఉదయాన్నే మోటార్లు, హీటర్ల వాడకం అధికంగా ఉండటమే ఇందుకు కారణమని అధికారులు చెబుతున్నారు. **15 నిమిషాలకోసారి నమోదు..**విద్యుత్తు పంపిణీ సంస్థ ప్రతి 15 నిమిషాలకు కరెంట్ డిమాండ్ రీడింగ్స్‌ను నమోదు చేస్తుంది. జీహెచ్ఎంసీలో ఈ నెల 16న నమోదైన గణాంకాల ప్రకారం.. ఉదయం 7.30 నుంచి 7.45 గంటల మధ్య గరిష్ఠంగా 2,929 మెగావాట్లు, సాయంత్రం 6 నుంచి 6.15 గంటల నడమ 2,900, తెల్లవారుజా మున 2.30 నుంచి 2.45 గంటల మధ్య 1,593 మెగావాట్లకు దిగువన డిమాండ్ ఉంటోంది.

# పైన చుక్‌చుక్.. కింద రయ్‌రయ్



హైదరాబాద్: మొదటిసారి డబుల్ డెక్కర్ పైవంతెనల నిర్మాణానికి జీహెచ్ఎంసీ సిద్ధమవుతోంది. ఎల్బీనగర్ నుంచి ఆరాంఘర్ వరకు ఉన్న ఇన్నర్ రింగు రోడ్డుపై ఇవి నాలుగు రానున్నాయి. నాగోల్ నుంచి ఎల్బీనగర్, చాంద్రాయణగుట్ట, ఆరాంఘర్ చౌరస్తా, శంషాబాద్ మీదుగా విమానాశ్రయం వెళ్లే 36.8కి.మీ పొడవైన మెట్రో రైలు మార్గంతో వీటిని అనుసంధానిస్తారు. కొత్తగా నిర్మించే పైవంతెనల వద్ద మాత్రం రెండో అంతస్తులో మెట్రో ఉంటుంది. ఇందుకోసం పిల్లర్లను ఎత్తుగా నిర్మించి మెట్రో మార్గానికి వదులుతారు. ఈ విధమైన అనుసంధానంతో.. మెట్రో కారిడార్ నిర్మాణ వ్యయం కొంత మేర తగ్గుతుంది. రహదారిపై స్థలం కలిసి వస్తుంది. ట్రాఫిక్ సమస్యకు 100శాతం పరిష్కారం లభిస్తుందని జీహెచ్ఎంసీ చెబుతోంది. ఈ నాలుగు నిర్మాణాల అంచనా వ్యయం రూ.955కోట్లు. అందుకు సంబంధించి మెట్రో రైలు సంస్థ, జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం డిజైన్లను రూపొందించే పనిలో ఉన్నాయి.

**స్థలం.. నిధులు సద్వినియోగం..**ప్రస్తుతమున్న రోడ్డు మార్గంపై పైవంతెనలను నిర్మిస్తే వాహనాల రాకపోకలు సులభతరం అవుతాయి. పైవంతెన నిర్మించాక.. అదే రోడ్డుపై మెట్రో రైలు మార్గాన్ని నిర్మిస్తే.. తొలగిపోయిన ట్రాఫిక్ సమస్య మళ్లీ పుట్టుకొస్తుంది. ఉదాహరణకు.. బేగంపేట విమానాశ్రయం కూడలి. గతంలో కూడలిలో పైవంతెన నిర్మించారు. కొన్నేళ్లకు పైవంతెన పక్కన మెట్రో మార్గం కోసం పిల్లర్లను నిర్మించారు. దీంతో బేగంపేట నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్లే రోడ్డు మార్గం కుంచించుకుపోయింది. భవిష్యత్తులో మెట్రో రైలు మార్గం అవసరమున్న రహదారులపై డబుల్ డెక్కర్ పైవంతెనలను నిర్మిస్తే ప్రజాధనం, స్థలం సద్వినియోగం అవుతాయని నిపుణులు గుర్తుచేస్తున్నారు.

**రెండు మార్గాల్లో ప్రతిపాదించినా..**

నగరం నుంచి ఆదిలాబాద్, కరీంనగర్ వైపు వెళ్లే రెండు జాతీయ రహదారులపై ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి మార్చిలో శంకుస్థాపన చేశారు. ప్యారడైజ్ కూడలి నుంచి సుచిత్ర కూడలి మీదుగా కండ్లకోయ వరకు, జేబీఎస్ నుంచి తాడ్‌బండ్, అల్వాల్, తూముకుంట వరకు ఆరు లైన్ల పైవంతెనలను నిర్మించాలన్నది ప్రణాళిక. ఆయా మార్గాల్లో ఓఆర్ఆర్ వెలుపలి వరకు భవిష్యత్తులో మెట్రో సేవలను పొడిగించాలన్న ఆలోచనతో.. ఎలివేటెడ్ కారిడార్లతో మెట్రో మార్గాన్ని అనుసంధానిస్తామని సర్కారు అప్పట్లో ప్రకటించింది. డబుల్ డెక్కర్ పైవంతెనల మార్గానికి సంబంధించి హెచ్ఎండీఏ, మెట్రో రైలు సంస్థలు డిజైన్లపై కసరత్తు చేస్తున్నాయి.

**ఎక్కడెక్కడంటే..**

1) టీకేఆర్ కాలేజీ కూడలి, గాయత్రినగర్, మందమల్లమ్మ కూడళ్లు.

2) ఒమర్ హోటల్ నుంచి సోయబ్ హోటల్ వరకు వయా మెట్రో ఫంక్షన్‌హాల్ మీదుగా

3) బండ్లగూడ–ఎర్రకుంట క్రాసు రోడ్డు కూడలి మీదుగా

4) మైలార్‌దేవ్‌పల్లి, శంషాబాద్ రోడ్డు, కాటేదాన్ కూడళ్ల మీదుగా

**ప్రణాళిక లోపంతో..**ఎల్బీనగర్ కూడలి, బైరామల్‌గూడ కూడలి, ఒవైసీ జంక్షన్, చాంద్రాయణగుట్ట జంక్షన్, హైటెక్‌సిటీలోని కొత్తగూడ జంక్షన్, గచ్చిబౌలి చౌరస్తా, జేఎన్‌టీయూ కూడళ్లలో పైవంతెనలు నిర్మించారు. ఎల్బీనగర్ నుంచి పెద్దఅంబర్‌పేట వరకు ఎక్స్‌ప్రెస్‌వే పనులు పురోగతిలో ఉన్నాయి. ఆయా మార్గాలన్నింటిలో మెట్రో సేవలను విస్తరిస్తామని గత, ప్రస్తుత ప్రభుత్వాలు ప్రకటించాయి. కానీ.. డీపీఆర్‌ను రూపొందించలేదు. రోడ్డు అభివృద్ధి పనుల్లో మెట్రో ప్రాజెక్టుకు స్థలం వదలాలన్న జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ సూచనలను పట్టించుకోకపోవడం.. ప్రణాళికా లోపాలకు అద్దం పడుతోంది.

# అందని ద్రాక్షగా రాయితీ పరికరాలు




కరీంనగర్ : దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించని చందంలా తయారైంది రైతుల పరిస్థితి. జిల్లా వ్యాప్తంగా 7898 ఎకరాల్లో పండ్లు, కూరగాయలు, పూలు సాగు చేస్తున్న అన్నదాతలకు.. ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ ద్వారా అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించి వారికి అవసరమైన రాయితీ విత్తనాలు, పరికరాలు అందించాల్సి ఉంటుంది. అదేమి లేకపోవడంతో ఉద్యానశాఖ కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారు. రాయితీ పరికరాలైన డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరుకు ప్రభుత్వం ఈ ఏడాది జిల్లాకు 361 హెక్టార్లకు లక్ష్యం విధించింది. అయితే ఇప్పటివరకు 198.47 హెక్టార్లకు మాత్రమే మంజూరు చేశారు.

**మంజూరు ఇలా..**

పరికరాలకు అవసరమైన రైతులు తొలుత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం ఉద్యానశాఖ సంబంధిత అధికారి క్షేత్రస్థాయిలో రైతు పొలాన్ని పరిశీలించి ఎన్ని పైపులు పడుతాయనే వాటిపై ఆరా తీస్తారు. రాయితీ పోను మిగతా డబ్బు ఎంతో చెప్పి సంబంధిత డ్రిప్ పైపులు సరఫరా చేసే సంస్థకు డీడీ తీయించి పంపించాల్సి ఉంటుంది. కానీ ఈ ప్రక్రియ క్షేత్రస్థాయిలో జిల్లా వ్యాప్తంగా జరగటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కానరాని అవగాహన సదస్సులు**

ఉద్యానశాఖ అధికారులు కూరగాయలు, పండ్లు, పూలు పండించే రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించి.. శాస్త్రవేత్తల ద్వారా వారికి అవసరమైన సలహాలు, సూచనలు, రాయితీ విత్తనాలు, ఎరువులు, పరికరాలు, పంటకు తెగుళ్లు సోకితే ఏ పురుగుమందు వేయాలనేది అవగాహన కల్పించాలి. అయితే సదస్సులు నిర్వహించినట్లు కాగితాలకే పరిమితమవుతోందని రైతులు వాపోతున్నారు.

**దరఖాస్తు విధానం**

రాయితీ పరికరాల కోసం %www.tgmip.com% వెబ్‌సైట్‌లో పట్టాదారు పాస్‌బుక్, రైతు ఫొటో, ఆధార్, తాజా 1బి పహాణీతో దరఖాస్తు చేయాలి. ఒకసారి రాయితీ పొందిన రైతులు ఏడేళ్ల వరకు తిరిగి పొందటానికి అనర్హులు. ఉన్నత వర్గానికి చెందిన రైతులకు 80 శాతం, బీసీలకు 90శాతం రాయితీతో అందజేయనున్నారు. ఎస్సీ, ఎస్టీలకు వందశాతం రాయితీ కల్పిస్తారు.

**డీడీలు పెండింగ్‌లో లేవు** గతంలో డీడీలు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. ప్రస్తుతం మా కార్యాలయం వద్ద పెండింగ్‌లో ఏమి లేవు. రైతులకు వంద శాతం న్యాయం చేస్తాం. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. శ్రీనివాసరావు, డీడీ, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ

**నేనే కొనుగోలు చేసుకున్నా..**

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి ఎనిమిది నెలలుగా కార్యాలయం చుట్టూ తిరిగినా అధికారులు పట్టించుకోలేదు. కార్యాలయానికి వెళ్లినప్పుడల్లా ఏదో కారణం చెప్పి పంపించేవారు. విసిగిపోయి రూ.1.60 లక్షలతో డ్రిప్ కొనుగోలు చేసి కూరగాయల తోటకు ఏర్పాటు చేసుకున్నా. మంద తిరుపతి, గోపాల్‌పూర్, కరీంనగర్ గ్రామీణం

# పాలన మారి.. వార్డులో అధికారి

నల్గొండ : తీసుకున్న నిర్ణయంతో ప్రజల వద్దకే పురపాలన రానుంది. వార్డుకో కార్యాలయం ఏర్పాటు చేసి అక్కడి నుంచి పట్టణ ప్రజలకు అవసరమైన సేవలు అందించే విధంగా చర్యలు చేపట్టింది. ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో డివిజన్‌కి ఓ అధికారిని నియమించి అన్ని రకాల సేవలు అక్కడి నుంచే అందించడం విజయవంతంగా కొనసాగుతోంది. వీఆర్ఏల సర్దుబాటులో భాగంగా నల్గొండ జిల్లాలోని 8 పురపాలికల్లో సుమారు 62 మందిని వార్డు అధికారులుగా నియమించింది. తాజాగా కొత్త పురపాలికల్లో సైతం వార్డు అధికారుల పోస్టులు మంజూరు చేసి, గ్రూప్-4 ద్వారా నియమితులైన 77 మందిని నల్గొండ జిల్లాకు కేటాయించడంతో వారిని జిల్లా కలెక్టర్ 8 పురపాలికలకు కేటాయించారు. 60 రోజుల్లోపు వారంతా తమకు కేటాయించిన పురపాలికల్లో నియామక ఉత్తర్వుల ప్రతులను అందజేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వార్డు అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించనున్నారు. పారిశుద్ధ్య సేవలు, సిబ్బందిపై పర్యవేక్షణ, మంచినీటి సరఫరా, ఆస్తి పన్నుల



వసూళ్లు, అక్రమ నిర్మాణాల గుర్తింపు, వాటిపై చర్యలు, వార్డు పరిధిలో ఆసరా పింఛన్ల పంపిణీ, జనన, మరణ, ధ్రువీకరణ పత్రాలు స్థానికంగా అందించనున్నారు. వార్డు కార్యాలయంలో ప్రజలు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులకు అందించే బాధ్యతలు నిర్వహించనున్నారు.

# అర్ధంతర పనులు.. రెట్టింపు కష్టాలు

పెద్దపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో మౌలిక వసతులు కల్పించాలన్న ప్రభుత్వ ఆశయం నెరవేరడం లేదు. 'మన ఊరు–మన బడి' పథకం కింద జిల్లాలోని 191 పాఠశాలల్లో సుమారు రూ.250 కోట్లతో పనులు ప్రారంభించినా నిధుల కొరతతో నిలిచిపోయాయి. ఇటీవల అమ్మ ఆదర్శ బడి కింద చేపట్టిన పనులదీ ఇదే పరిస్థితి. **12 రకాలు..** భారాస ప్రభుత్వ హయాంలో మన ఊరు–మన బడి పథకం కింద తరగతి గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, అదనపు గదులు, వంట గది, ప్రహరీ, భవనాలకు రంగులు వేయడం, విద్యుత్తు, ఫర్నిచర్, పచ్చదనం పెంపు, భోజన గది, డిజిటల్ ల్యాబ్.. ఇలా 12 రకాల పనులు ప్రారంభించారు. రెండేళ్లుగా పనులు నత్తనడకన సాగుతుండగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సందిగ్ధం నెలకొంది. నిధులు రాకపోవడంతో గుత్తేదారులు చేతులెత్తేశారు. ఈ ఏడాది అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా 545 చోట్ల మౌలిక వసతుల కల్పనకు రూ.29.63 కోట్లతో చేపట్టిన పనులు కూడా వెక్కిరిస్తున్నాయి. అసంపూర్తి పనులతో బోధనకు ఇబ్బంది ఏర్పడుతోంది. పలు పాఠశాలల్లో ఆరుబయట తరగతులు నిర్వహించాల్సి వస్తోంది. మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక ఇబ్బంది పడుతున్నారు.

సుల్తానాబాద్ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో భోజనశాల నిర్మాణానికి రూ.29 లక్షలు మంజూరయ్యాయి. గుత్తేదారు రూ.14.50 లక్షలు వెచ్చించి పలు పనులు చేసి, బిల్లులు రాకపోవడంతో ఆపేశారు. విద్యార్థులు తరగతి గదుల్లో, వరండాలో, చెట్ల కింద భోజనం చేయాల్సి వస్తోంది. దుర్గంధంతో విద్యార్థులకు అసౌకర్యంధర్మారం ఆదర్శ పాఠశాలకు రూ.13.61 లక్షలు మంజూరు కాగా మరుగుదొడ్లు, మూత్రశాలల మరమ్మతు, కిటికీలు, వెంటిలేటర్లకు దోమల జాలీలు, కుళాయిలు ఏర్పాటు చేయించారు. వసతిగృహం ముందు సెప్టిక్ ట్యాంకు నిర్మాణం చేపట్టగా ప్లాస్టరింగ్ చేసి పైపులైనుతో అనుసంధానించాల్సి ఉంది. పక్కనున్న తరగతి గదుల్లోకి భరించలేదని దుర్గంధం వెదజల్లుతోందని విద్యార్థులు తెలిపారు.

మరమ్మతు మమఇడ్లాపూర్ ప్రాథమిక పాఠశాలకు రూ.4.40 లక్షలు మంజూరు కాగా పాత మరుగుదొడ్లకే మరమ్మతులు చేసి, ఎంబీ రికార్డు చేసినట్లు తెలుస్తోంది. తలుపులు సరిగ్గా లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. నాసిరకంగా, తూతూ మంత్రంగా పనులు చేసి నిధులు స్వాహా చేసినట్లు ఆరోపణలున్నాయి.

**రికార్డు చేసినా పైసా రాలే!** వడ్కాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో భోజనశాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.52 లక్షలు మంజూరు చేసింది. గుత్తేదారు బిల్లులు రాకపోవడంతో ఏడాది కిందట పనులు అర్ధంతరంగా వదిలేశారు. రూ.15 లక్షలకు ఎంబీ రికార్డు చేసినా పైసా రాలేదని గుత్తేదారు ఆవేదన వ్యక్తం చేశారు. అసంపూర్తి పనులతో భోజన సమయంలో దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వాపోయారు. కలెక్టర్ ఆదేశించినా అంతే!బేగంపేట ఉన్నత పాఠశాల భోజనశాలలో విద్యుత్తు సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణం పనులు చేపట్టగా అసంపూర్తిగా ఉన్నాయి. తరగతి గదులు, పాఠశాల ప్రహరీ నిర్మాణం, మైదానం సరిచేయడం వంటి పనులు జరగాల్సి ఉంది. గతంలో కలెక్టర్ శ్రీహర్ష పాఠశాలను సందర్శించి పనుల పూర్తిపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రూ.16 లక్షలు మంజూరు చేసినా గుత్తేదారు సమస్యతో పనులు జరగడం లేదు.

పిల్లర్లతో వదిలేశారు!గోపాల్‌పూర్(పెద్ద ఓదాల) ఎంపీపీఎస్ పాఠశాల భవనాన్ని పూర్తిగా తొలగించారు. తిరిగి పిల్లర్ల వరకు నిర్మించి అర్ధంతరంగా వదిలేశారు. అడవిసోమన్‌పల్లి యూపీఎస్‌లో వంటగది, భవనం ప్లాస్టరింగ్, సింక్ పనులు ఇంకా పూర్తి కాలేదు. అర్ధంతర పనులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

నోరు తెరిచిన సంపులుమండలంలోని 29 పాఠశాలల్లో పనులు చేపట్టగా కొన్ని చోట్ల పూర్తయినా చాలా చోట్ల నత్తనడకన సాగుతున్నాయి. జిల్లెల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో సంపు వద్ద పై కప్పు అసంపూర్తిగా వదిలేశారు. లక్కారం పంచాయతీ కాశిపల్లి బడిలో సంపుపై కప్పు వేయకపోవడంతో ఉపాధ్యాయుడు తాత్కాలికంగా చెక్కలు ఏర్పాటు చేశారు. వర్షాకాలంలో ఇబ్బందులు కుక్కలగూడూరు ఉన్నత పాఠశాలలో భోజనశాల నిర్మాణం చేపట్టగా బిల్లులు రాక పనులు ఆగిపోయాయి. గోడల వరకు పనులు చేసి, పైకప్పు వేయకపోవడంతో వర్షాకాలంలో విద్యార్థులు భోజనం చేయడానికి ఇబ్బంది పడుతున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద బోరు మోటారు నుంచి ట్యాంకు వరకు పైపులైను అనుసంధాన పనులు, వాష్‌బేసిన్‌కు నల్లాల కనెక్షన్‌తో పాటు టైల్స్ పనులు చేయాల్సి ఉంది.

# పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

గోదావరిఖని : రామగుండం నగరపాలక ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఇటీవల సుమారు రూ. కోటి వ్యయంతో కొనుగోలు చేసిన ఆటో ట్రాలీలు, ట్రాక్టర్లను వినియోగంలోకి తేవడంతో పాటు నగరపాలక కార్యాలయంలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను తిరిగి అదే విభాగంలోకి తీసుకోవాలని నిర్ణయించారు. నగరపాలక నిర్వహణపై సమీక్షించిన జిల్లా పాలనాధికారి ఈ మేరకు నగరపాలక పారిశుద్ధ్య విభాగం అధికారులకు మార్గదర్శనం చేశారు. సుమారు 40 మంది పారిశుద్ధ్య కార్మికులు నగరపాలక కార్యాలయంలో వివిధ విభాగాల్లో ఉన్నారు. వారిని తిరిగి యథావిధిగా పారిశుద్ధ్య విభాగంలోకి తీసుకొని పనులు చేయించాలని, నూతన వాహనాలను సైతం వాడుకలోకి తేవాలన్నారు. తెచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**సంస్కరిస్తే ప్రయోజనకరం**

రామగుండం నగరపాలక సంస్థలోని పారిశుద్ధ్య విభాగంలో మొత్తం 447 మంది ఒప్పంద కార్మికులు ఉండగా అందులో డ్రైవర్లు, డ్రెయిన్ క్లీనర్లు, స్వీపర్లు, చెత్త ఎత్తే కార్మికులు ఉన్నారు. వీరిలో కేవలం 192 మంది పారిశుద్ధ్య కార్మికులు చెత్త సేకరణలో వినియోగించే ట్రాక్టర్లు, ఆటో ట్రాలీలపై విధుల్లో ఉన్నారు. రామగుండం నగరపాలికలో ప్రస్తుతం 14 ట్రాక్టర్లు, 50 ఆటో ట్రాలీలు చెత్త సేకరణలో వినియోగిస్తుండగా ట్యాంకర్లు, బ్లేడ్ ట్రాక్టర్లు, జేసీబీ యంత్రాలు, బొలెరో వాహనాలున్నాయి. వీటిపై మొత్తం 100 మంది డ్రైవర్లు పనిచేస్తున్నారు. చెత్త సేకరణ విభాగంలో కొందరు డ్రైవింగ్ లైసెన్సు కలిగిన వారు ఉన్నారు. అలాంటి వారికి అవసరమైన శిక్షణ ఇచ్చినట్లయితే కార్మికుల సంఖ్య పెరగకుండానే నూతనంగా కొనుగోలు చేసిన ఆటో ట్రాలీలు, ట్రాక్టర్లను వినియోగంలోకి తీసుకువచ్చే అవకాశం ఉంది. నగరపాలక కార్యాలయంలో పనిచేస్తున్న 40 మంది పారిశుద్ధ్య కార్మికులను తిరిగి అదే విభాగంలోకి తీసుకోవడంలో కార్మికుల కొరత సైతం తీరే అవకాశం ఉంది. పాత ఆటో ట్రాలీలు, ట్రాక్టర్లు సైతం తరచూ మొరాయిస్తుండటంతో ఆయా డివిజన్లలో చెత్త సేకరణ నామమాత్రంగా జరుగుతోంది. నూతనంగా కొనుగోలు చేసిన వాహనాలను వినియోగంలోకి తేవడంతో పాటు పాత వాహనాలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయిస్తే చెత్త సేకరణ నిత్యం జరిగే అవకాశముంది.




అమరావతి: రాజధాని అమరావతి టెండర్ల ప్రక్రియను జనవరి నెలాఖరులోపు పూర్తిచేసి ఫిబ్రవరి రెండోవారంలో పనులు ప్రారంభిస్తామని ఏపీ పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ తెలిపారు. మూడేళ్లలో అమరావతి నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. న్యాయపరమైన ఇబ్బందులతో పనుల ప్రారంభం ఆలస్యమైందని చెప్పారు. రాజధాని ప్రాంతంలో పర్యటించిన మంత్రి.. నేలపాడు సమీపంలోని అడ్మినిస్ట్రేటివ్ టవర్లను పరిశీలించారు. అనంతరం మీడియాతో నారాయణ మాట్లాడారు. ఇప్పటి వరకు మొత్తం 40 పనులకు టెండర్లు పిలిచామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం అరాచక పాలనతో ప్రజలను భయభ్రాంతులను గురి చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. "రాజధానిని ప్రపంచంలో టాప్-5లో ఒకటిగా చేయాలనే లక్ష్యంతో ఐకానిక్ భవనాల డిజైన్లను నార్మన్ ఫోస్టర్ చేత చేయించాం. అధికారులు, ఉద్యోగులు, జడ్జీల కోసం 2019కు ముందే మొత్తం 4053 అపార్ట్‌మెంట్ల పనులు ప్రారంభించాం. మాపై కక్షతో గత ప్రభుత్వం నిర్మాణాలను ఆపేసింది. అసెంబ్లీని 250 మీటర్ల ఎత్తులో నిర్మించి.. మిగిలిన రోజుల్లో టూరిజం స్పాట్‌గా మార్చాలని డిజైన్లు రూపొందించాం. రాష్ట్ర స్థాయి అధికారులందరూ ఒకేచోట ఉండేలా 5 అడ్మినిస్ట్రేటివ్ టవర్లకు డిజైన్ చేశాం. విద్యుత్ లైన్లు, డ్రైనేజీలు, తాగు నీటి పైపులు అండర్ గ్రౌండ్‌లో ఉండేలా డిజైన్ రూపొందించాం" అని మంత్రి నారాయణ తెలిపారు.

## గ్రీన్ ఎనర్జీతో ఏపీలో భారీగా పెట్టుబడులు



విజయవాడ: రాబోయే ఐదేళ్ల కాలంలో ఏపీ మొత్తం క్లీన్ ఎనర్జీనే ప్రముఖ పాత్ర పోషిస్తున్నట్లు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. విజయవాడ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో ఐటీ డిపార్ట్ మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన రీసెర్చ్ కాంక్లేవ్-2025లో ముఖ్య అతిథిగా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మీడియాతో మాట్లాడుతూ... ప్రతీ ఇంట్లో ఒక వ్యక్తి ఉద్యోగస్తుడై ఉండాలని నారా చంద్రబాబు నాయుడు సంకల్పించారని అన్నారు. సీఎం చంద్రబాబు అభివృద్ధి చేసిన ఐటీ రంగంతో తెలుగు వారు ఉన్నత స్థానాల్లో ఉన్నారని చెప్పారు. ప్రస్తుతం చంద్రబాబు నాయుడు గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. గ్రీన్ ఎనర్జీతో రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు, ఉద్యోగాలతో పాటు పొల్యూషన్ ఫ్రీ స్టేట్‌గా ఏపీ మారుతుందని తెలిపారు. విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా మారి ఇతరులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అన్నారు. విద్యార్థులు సమాజానికి ఉపయోగ పడే పరిశోధనలు చేయాలని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పేర్కొన్నారు.

## రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు తగ్గుతున్నాయి: మంత్రి సత్యకుమార్ యాదవ్



విజయవాడ: రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు తగ్గుతున్నాయని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వారధి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ పాల్గొని మాట్లాడారు. అన్ని స్థాయిల్లో వ్యవస్థలో పద్ధతి ప్రకారం అన్ని పదవుల నిర్ణయం జరుగుతుందని చెప్పారు. అధికారంలో భాగస్వామ్యం ఉంది కనుక ప్రజల సమస్యలు తీర్చడంలో ముందున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. సూర్యఘర్ ద్వారా ప్రతీ ఇంటికి ఆదాయ వనరుగా మార్చే పనులు చేస్తున్నామని తెలిపారు. 2030 నాటికి 500 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. PPP మోడ్‌లో మెడికల్ కాలేజీలు తేవాల్సిన పరిస్థితికి గత వైసీపీ ప్రభుత్వమే కారణమన్నారు. నిధులు సరిగా ఇవ్వకుండా కాలేజీల నిర్మాణం జరగకపోవడానికి గత ప్రభుత్వం కారణమని ఆరోపించారు. సిద్ధార్థ మెడికల్ కాలేజీలో విద్యార్థినులకు హాస్టల్ లేదన్నారు. P4 మోడల్‌లో మెడికల్ కాలేజీలు వచ్చిన దానికి తగిన ఫ్రీ సీట్లు ఉంటాయని మంత్రి సత్యకుమార్ తెలిపారు.

## రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసు.. పోలీసు కస్టడీకి తులసిబాబు



అమరావతి: రఘురామకృష్ణరాజును సీఐడీ కస్టడీలో వేధించిన కేసులో ఆరో నిందితుడిగా ఉన్న తులసిబాబుకు కోర్టు మూడు రోజుల పోలీసు కస్టడీకి అనుమతించింది. ఈనెల 27 నుంచి 29 వరకు తులసిబాబుకు కస్టడీ విధిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం అతను గుంటూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు.

## ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున మ్యూజిక్ నైట్



విజయవాడ: ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫ్రిబవరి 15వ తేదీన ఇఫ్టోరియా మ్యూజిక్ నైట్ నిర్వహిస్తామని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి తెలిపారు. ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగే కార్యక్రమంలో సంగీత దర్శకుడు తమన్ పాల్గొంటారని అన్నారు. ఇందిరాగాంధీ స్టేడియాన్ని ఇవాళ(శుక్రవారం) భువనేశ్వరి పరిశీలించారు. %చీ=% ట్రస్ట్ ఏర్పాటు చేసే ఈ ఈవెంట్‌కు ప్రణాళికలు చేస్తున్నామని తెలిపారు. ఫిబ్రవరి15న జరగబోయే ఈ కార్యక్రమంపై చర్చించారు. పాస్‌లు ఉంటేనే లోపలకు అనుమతి ఇస్తామని స్పష్టం చేశారు. ఈ మ్యూజికల్ నైట్‌ను వీక్షించేందుకు కుటుంబ సభ్యులతో కలిసి అందరూ రావాలని నారా భువనేశ్వరి కోరారు. మీరు కొనే టిక్కెట్ డబ్బుతో తలసేమియాతో బాధపడే వారికి సహకారం అందిస్తామని అన్నారు. సోషల్ కాజ్‌తో ఐదు సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఒక్కో సెంటర్ ఏర్పాటుకు రూ. 60 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పారు. తలసేమియాతో బాధపడే వారికి మందులు, రక్తం వంటి వాటికి చాలా ఖర్చు అవుతుందన్నారు. ఉచితంగా బ్లడ్, మందులు ఇప్పటికే అందజేస్తున్నామని చెప్పారు. ఇది ఒక మంచి ఉద్దేశంతో చేసే కార్యక్రమమని.. అందరూ తమ ఆపన్నహస్తం అందిస్తారని ఆశిస్తున్నానని భువనేశ్వరి పేర్కొన్నారు.

## తిరుమలలో దాతల భవనాలకు ఆధ్యాత్మిక, ధార్మిక పేర్లు

తిరుమల: తిరుమలలో దాతల సహకారంతో నిర్మించిన అతిథి గృహాలకు గతంలో ఆయా సంస్థలు, వ్యక్తుల పేర్లు ఉండగా వాటిని మార్చాలని తితిదే ధర్మకర్తల మండలి నిర్ణయించింది.

మొదటగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తితిదే బోర్డు సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతుల విరాళంతో నిర్మించిన లక్ష్మీ వీపీఆర్ భవనం పేరును లక్ష్మీ భవన్‌గా మార్చారు. ఇదే తరహాలో తిరుమల వ్యాప్తంగా దాతల సహకారంతో నిర్మించిన 45 అతిథి గృహాలకు వ్యక్తిగత పేర్ల స్థానంలో ఆధ్యాత్మిక, ధార్మిక పేర్లను పెట్టనున్నారు. ఇప్పటికే పలువురు దాతలు ఇందుకు అంగీకారం తెలిపారు.






## కోడికత్తి కేసు విచారణ మరోసారి వాయిదా

విశాఖపట్నం: కోడి కత్తి కేసు విచారణ మరోసారి వాయిదా పడింది. విశాఖపట్నంలోని ఎన్ఐఏ కోర్టుకు నిందితుడు జనుపల్లి శ్రీనివాస్ తన న్యాయవాది అబ్దుల్ సలీంతో కలిసి హాజరయ్యాడు. ఫిర్యాదుదారుగా ఉన్న మాజీ సీఎం జగన్ కోర్టుకు రాకపోవడంతో విచారణ వచ్చే నెల 21కి వాయిదా పడినట్లు న్యాయవాది సలీం తెలిపారు. సాక్ష్యం చెప్పేందుకు మూడేళ్లుగా జగన్ కోర్టుకు హాజరుకాకపోవడంతో కేసు ముందుకు కదలడం లేదని విశాఖ దళిత సంఘం (విదసం) ఆక్షేపించింది. కోర్టు వాయిదాకు గైర్హాజయ్యేవారిని కోర్టు ధిక్కరణకు పాల్పడుతున్నట్లుగా పరిగణించాలని కోరింది.




## రథసప్తమి రోజు వీఐపీ బ్రేక్ దర్శనాలు.. ఆర్జిత సేవలు రద్దు: తితిదే ఈవో

తిరుమల: తిరుమలలో మినీ బ్రహ్మోత్సవాల తరహాలో జరగనున్న రథసప్తమి ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. రథసప్తమి వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లపై తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో అదనపు ఈవో, వివిధ విభాగాల అధికారులతో ఈవో సమీక్షించారు. భక్తులు గ్యాలరీల్లోకి ప్రవేశించే, నిష్క్రమణ ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్యాలరీలలో ఉండే భక్తులకు సకాలంలో అన్నప్రసాదాలు, తాగునీరు అందించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భద్రత, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం.. అదనపు ఈవో వెంకయ్యచౌదరి, అధికారులతో కలిసి తిరుమల మాడవీధుల్లో ఏర్పాట్లను ఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ.. "శ్రీవారి ఉత్సవాల్లో రథసప్తమి అత్యంత ముఖ్యమైనది. ఏటా శుక్లపక్ష సప్తమి తిథిలో సూర్య జయంతి సందర్భంగా తిరుమలలో రథసప్తమిని వైభవంగా నిర్వహిస్తారు. ఈ వేడుకకు సుమారు లక్ష మంది భక్తులు వచ్చే అవకాశం ఉంది. వేడుకల్లో భాగంగా స్వామివారు సప్త వాహనాలపై భక్తులకు దర్శనమిస్తారు. ఫిబ్రవరి 4న ఉదయం 5.30 గంటలకు సూర్యప్రభ వాహన సేవతో రథసప్తమి వేడుకలు ప్రారంభమవుతాయి. అదే రోజు రాత్రి చంద్రప్రభ వాహనసేవతో శ్రీమలయప్పస్వామివారి వాహన సేవలు ముగుస్తాయి" అని ఈవో తెలిపారు.

**భక్తులకు తితిదే సూచనలు...** రథసప్తమి సందర్భంగా పలు సేవలు, ప్రివిలేజ్ దర్శనాలు రద్దు. అష్టాదళ పాదపద్మారాధన, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవలు రద్దు. ఎన్ఆర్ఐలు, చంటి బిడ్డల తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్లు, వికలాంగుల ప్రివిలేజ్ దర్శనాలు రద్దు. తిరుపతిలో ఫిబ్రవరి 3 నుంచి 5 వరకు స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్లు జారీ చేయడం లేదు. ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు. బ్రేక్ దర్శనాలకు సంబంధించి ఫిబ్రవరి 3న ఎలాంటి సిఫార్సు లేఖలు స్వీకరించడం లేదు. ప్రత్యేక ప్రవేశ దర్శనం (రూ.300 దర్శనం) టోకెన్లు ఉన్న భక్తులు వేచి ఉండకుండా ఉండేందుకు నిర్ణీత సమయంలో మాత్రమే వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద రిపోర్టు చేయాలి.

**శ్రీవారి వాహనసేవల వివరాలు..** ఉదయం 5.30 గంటల నుంచి 8 గంటల వరకు – సూర్యప్రభ వాహన సేవ, ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు – చిన్నశేష వాహన సేవ, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు – గరుడ వాహన సేవ, మధ్యాహ్నం 1 గంట నుంచి 2 గంటల వరకు – హనుమంత వాహన సేవ, మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు – చక్రస్నానం , సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు – కల్పవృక్ష వాహన సేవ, సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు – సర్వభూపాల వాహన సేవ, రాత్రి 8 గంటల నుంచి 9 గంటల వరకు – చంద్రప్రభ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు.

## మహా కుంభమేళా.. ఆ రోజు 'నో వీఐపీ ట్రీట్‌మెంట్'!

ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్‌లో కుంభమేళా వైభవోపేతంగా జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ మహా కుంభమేళాకు దేశ విదేశాల నుంచి భక్తులు పోటెత్తుతున్నారు. గంగా, యమున, సరస్వతీ నదులు కలిసే త్రివేణి సంగమంలో పెద్ద ఎత్తున పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు. కాగా, ఈ నెల 29న మౌని అమావాస్య కావడంతో అందుకనుగుణంగా తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా మౌని అమావాస్య రోజున ఆ ప్రదేశంలో వీఐపీ జోన్ ఉండదని.. ప్రముఖులకు ప్రత్యేక ఏర్పాట్లు ఉండవని ప్రభుత్వం తెలిపింది. ప్రయాగ్ రాజ్‌లోకి వాహనాలను అనుమతించబోమని వెల్లడించింది. ప్రజల భద్రత దృష్ట్యా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆ ఒక్కరోజే దాదాపు 8 నుంచి 10కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు(అమృత స్నానం) ఆచరించే అవకాశం ఉన్నందున 12 కిలోమీటర్ల పొడవైన ఘాట్‌ను ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ట్రాఫిక్, జనం రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక సిబ్బందిని మోహరించామన్నారు. 144ఏళ్ల తర్వాత గ్రహాల అరుదైన కలయిక ఏర్పడనున్న ఈ సందర్భానికి ప్రత్యేకత ఉండటంతో భారీ రద్దీ నెలకొనబోతోందని అధికారులు పేర్కొంటున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అఖిల



భారతీయ అఖాడా పరిషద్(ఏబీఏపీ) అఖాడాల(సాధువులు)కు ప్రత్యేక సూచన చేసింది. ఆరోజున 'అమృత్ స్నాన్'కు తరలిరానున్న 13 లక్షల అఖాడాలు తమకు కేటాయించిన సమయంలోనే త్రివేణి సంగమంలో స్నానమాచరించే ప్రక్రియను ముగించాలని సూచించింది. దీనివల్ల ఇతర భక్తులకు అసౌకర్యం కలగదని పేర్కొంది.

జనవరి 29 ( మౌని అమావాస్య), ఫిబ్రవరి 3 (వసంత పంచమి), ఫిబ్రవరి 12 (మాఘ పూర్ణిమ), ఫిబ్రవరి 26 (మహా శివరాత్రి) పర్వదినాల్లో భక్తులు అమృత స్నానాలు ఆచరించనున్నారు.

## తురకా కిషోర్‌ను నెల్లూరు జైలుకు తరలింపు

నరసారావుపేట, జనవరి 24: మాచర్లకు చెందిన టీడీపీ నేత కేశవరెడ్డి నివాసంపై దాడి కేసులో అరెస్టయిన వైసీపీ నేత తురకా కిషోర్‌ను పోలీసులు శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. అతడితోపాటు అతడి సోదరుడు తురకా శ్రీకాంత్‌ను సైతం పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. దీంతో వారిద్దరికి మాచర్ల కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఈ నేపథ్యంలో ఈ సోదరులిద్దరిని కట్టుదిట్టమైన భద్రత నడుమ నెల్లూరు జైలుకు తరలించారు. మాచర్ల మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి తురకా కిషోర్‌తోపాటు అతడి సోదరుడు శ్రీకాంత్ ప్రధాన అనుచరులుగా వ్యవహరిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మాచర్ల మున్సిపల్ చైర్మన్‌గా తరుకా కిషోర్ వ్యవహరించారు. అంతేకాదు గత ప్రభుత్వ హయాంలో ఆయన చెలరేగిపోయారు. ఇంకా చెప్పాలంటే.. 2022లో మాచర్లలోని టీడీపీ కార్యాలయాన్ని తగులబెట్టిన కేసులో తురకా కిషోర్‌తోపాటు అతడి సోదరుడిపై పార్టీ శ్రేణులు పోలీసులకు ఫిర్యాదు చేశాయి. దీంతో వారిపై కేసు నమోదు చేశారు. కానీ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అదికాక.. పిన్నెల్లి సోదరుల అండ దండా చూసుకొని తురకా కిషోర్, తురకా శ్రీకాంత్ మరింత రెచ్చిపోయారు. ఇక 2022, డిసెంబర్ 16వ తేదీన మాచర్ల టీడీపీ ఇన్‌ఛార్జ్ జూలకంటి బ్రహ్మారెడ్డి.. ఇదేం ఖర్మ ఆంధ్రప్రదేశ్‌కు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నేపథ్యంలో ముందస్తు ప్రణాళికల్లో భాగంగా ఈ కార్యక్రమంపై తురక కిషోర్‌తోపాటు అతడి వందలాది మంది అనుచరులు దాడి చేశారు. ఆ క్రమంలో వారిపై హత్యాయత్నానికి ఒడిగట్టారు. అలాగే టీడీపీకి చెందిన పలువురి నేతలు ఇళ్లలో లూటీకి సైతం పాల్పడ్డారు. అక్కడ నిలిపి ఉన్న వాహనాలను కూడా ధ్వంసం చేశారు. అదే రోజు రాత్రి.. మాచర్లలోని టీడీపీ కార్యాలయాన్ని తగలబెట్టారు. ఈ మొత్తం వ్యవహారంపై పోలీసులకు టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. మరోవైపు కారంపూడి సీఐపై దాడి చేయడంతోపాటు ఏపీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సమయంలో బూత్‌ల వద్ద టీడీపీ ఏజెంట్లపై తురకా కిషోర్ దాడి చేశారు. ఇక మాచర్ల



పర్యటనకు వెళ్లిన టీడీపీ సీనియర్ నేతలు బుద్దా వెంకన్న, బొండా ఉమాలు ప్రయాణిస్తున్న కారుపై దాడి చేసి.. వారిపై హత్యాయత్నానికి తురకా కిశోర్ తెగబడ్డారు. ఈ ఘటనలో కారులోని న్యాయవాది సైతం గాయపడ్డారు. ఈ మొత్తం ఎపిసోడ్‌లో తురకా బ్రదర్స్‌పై దాదాపు10 కేసులుపైగా నమోదయ్యాయి. అయితే గతేడాది మే, జూన్ మాసంలో ఏపీ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కూటమికి ఓటర్ పట్టం కట్టాడు. దీంతో చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. ఈ నేపథ్యంలో తురకా కిషోర్ బ్రదర్స్ అండర్ గ్రౌండ్‌లోకి వెళ్లిపోయాడు. వారి కోసం దాదాపు ఏడు నెలల పాటు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఆ క్రమంలో తురకా కిషోర్ హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించారు. దీంతో అతడిని ఈ ఏడాది జనవరి మొదటి వారంలో ఏపీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మాచర్ల తరలించి.. కోర్టులో హాజరుపరచగా.. వారికి 14 రోజుల పాటు కోర్టు రిమాండ్ విధించిన సంగతి తెలిసిందే. ఈ రిమాండ్ ముగియడంతో.. మళ్లీ వారిని కోర్టులో హాజరు పరిచారు. దీంతో మళ్లీ వారికి కోర్టు రిమాండ్ విధించింది.

## అన్యాయం జరిగితే కోర్టును ఆశ్రయించాల్సింది వాళ్లు కదా?: ఏపీ హైకోర్టు అసంతృప్తి

అమరావతి: ఏపీ దేవాదాయ శాఖ కమిషనర్‌గా కె.రామచంద్రమోహన్ నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. థర్డ్ పార్టీ పిటిషన్ దాఖలు పట్ల న్యాయమూర్తి అసంతృప్తి వ్యక్తం చేశారు. "రామచంద్రమోహన్ పోస్టింగ్‌తో ఎవరికైనా అన్యాయం జరిగితే కోర్టును ఆశ్రయించాల్సింది వాళ్లు కదా? థర్డ్ పార్టీ ఎలా పిటిషన్ దాఖలు చేస్తుంది?" అని ప్రశ్నించారు. పిటిషన్‌పై ఆదేశాలు ఇచ్చేందుకు నిరాకరించిన న్యాయమూర్తి.. సర్వీస్ మ్యాటర్స్ పరిశీలించే బెంచ్‌కి ఈ పిటిషన్‌ను పంపాలని సూచించారు. హైకోర్టు నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో దేవాదాయశాఖ ప్రస్తుత కమిషనర్ సత్యనారాయణ రిలీవ్ అయ్యే అవకాశముంది. నాలుగు రోజుల కిందట జరిగిన ఐఏఎస్ అధికారుల బదిలీల్లో దేవాదాయశాఖ కమిషనర్, ఆ శాఖ ఇన్‌ఛార్జి కార్యదర్శి సత్యనారాయణను బీసీ సంక్షేమశాఖ కార్యదర్శిగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో దేవాదాయ శాఖ కమిషనర్‌గా రామచంద్రమోహన్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయన్ను ఎలాగైనా దేవాదాయ కమిషనర్ పదవి చేపట్టనివ్వకుండా కొందరు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయనకు అర్హత లేదంటూ




హైకోర్టులో గురువారం ఒకరు పిటిషన్ వేశారు. గతంలో సింహాచలం భూముల కేసులో ఆయన్ను ప్రభుత్వానికి సరెండర్ చేశారని, సస్పెండ్ కూడా అయ్యారని, విజిలెన్స్ విచారణ జరుగుతోందని, అప్పట్లో కోర్టును తప్పుదోవ పట్టించి మళ్లీ ఉద్యోగంలో చేరారని అందులో ప్రస్తావించారు. విచారణ చేపట్టిన హైకోర్టు.. థర్డ్ పార్టీ పిటిషన్ దాఖలు చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఆదేశాలు ఇచ్చేందుకు నిరాకరించింది.

# మెహ్రీన్ అందాల మాయాజాలం

నాని హీరోగా నటించిన కృష్ణ గాడి వీర ప్రేమ గాథ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ మెహ్రీన్. ఈ అమ్మడిని కెరీర్ ఆరంభంలో జూనియర్ మిల్కీ బ్యూటీ అంటూ పిలిచే వారు. మిల్కీ బ్యూటీ తమన్నా మాదిరిగా స్కిన్ టోన్ అదిరి పోయిందని, మెహ్రీన్ కి సైతం మంచి ఫ్యూచర్ ఉందని కెరీర్ ఆరంభంలో చాలా మంది చాలా రకాలుగా అభిప్రాయం వ్యక్తం చేశారు. కానీ ఈ అమ్మడికి టాలీవుడ్‌లో ఆశించిన స్థాయిలో భారీ విజయాలు సొంతం కాలేదు. చేసిన కొన్ని సినిమాల్లో ఎక్కువ శాతం ఫ్లాప్‌లు ఉన్నాయి. ఎఫ్ 2 వంటి సినిమాల్లో మంచి పాత్రలు దక్కించుకున్నా ఆ తర్వాత ఎక్కువ ఆఫర్లు దక్కించుకోవడంలో మెహ్రీన్ ఫెయిల్ అయ్యింది. కెరీర్‌లో కొన్ని తప్పుడు నిర్ణయాల వల్ల ఆఫర్లు తగ్గాయి అంటూ ఆ మధ్య ఒక ఇంటర్వ్యూలో ఈ అమ్మడు చెప్పుకొచ్చింది. ఆ నిర్ణయాలు ఏంటి అనే విషయం పక్కన పెడితే సోషల్ మీడియాలో ఈమె ఇంకా అందమైన ఫోటోలను షేర్ చేస్తూనే ఉంది. తన అభిమానులతో పాటు నెటిజన్స్ ని మాయ చేస్తూ అందంతో



మత్తు చల్లినట్లుగా కవ్విస్తోంది. ఈ స్థాయి అందాల ఆరబోత కేవలం మెహ్రీన్‌కే సాధ్యం అన్నట్లుగా నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. మహానుభావుడు, రాజా ది గ్రేట్, ఎఫ్ 2 సినిమాలతో సక్సెస్‌లు దక్కించున్న మెహ్రీన్ ఎఫ్ 3 తర్వాత పెద్దగా కనిపించడం లేదు. సినిమాల్లో ఎక్కువగా కనిపించకున్నా సోషల్ మీడియాలో మాత్రం మెహ్రీన్ రెగ్యులర్‌గా కనిపిస్తూనే ఉంది. ఆకట్టుకునే అందం తో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అనే విషయం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సోషల్ మీడియాలో ఈ అమ్మడు చేసే అందాల ఆరబోత ఫోటోల కారణంగా రెగ్యులర్‌గా వార్తల్లో ఉంటుంది. కనుక ముందు ముందు ఈమె మరిన్ని సినిమాల్లో నటించే అవకాశాలు ఉన్నాయి అంటూ ఇండస్ట్రీ వర్గాల వారితో పాటు ప్రేక్షకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మెహ్రీన్ అందానికి మరో అయిదు ఆరు ఏళ్లు పెద్ద సినిమాల్లో నటించే అవకాశాలు ఉన్నాయి. మెహ్రీన్ ఒక సాధారణ సిక్కు ఫ్యామిలీలో జన్మించింది. చిన్న వయసులోనే కెనడాలోని టొరంటోలో మిస్ పర్సనాలిటీ సౌత్ ఆసియా కెనడా 2013 కిరీటాన్ని సొంతం చేసుకుంది. సుదీర్ఘ కాలం పాటు మోడలింగ్‌లో రాణించిన మెహ్రీన్ కి సినిమాల్లో ఆఫర్లు వచ్చినా మోడలింగ్ కంటిన్యూ చేసింది. ఆ మోడలింగ్ అనుభవంతో ఎన్నో కమర్షియల్ యాడ్స్ లో ఇప్పటికీ నటిస్తూనే ఉంది. ముందు ముందు టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌లోనూ బిజీ హీరోయిన్‌గా మారాలని ఆశ పడుతున్నట్లుగా ఆమె సన్నిహితులు చెబుతున్నారు. మరి మళ్లీ మెహ్రీన్‌కి ఆఫర్లు దక్కేనా చూడాలి.

# సమంత పోస్ట్.. 2025లో పిల్లలట!

స్టార్ హీరోయిన్ సమంత.. ఇన్ స్టాగ్రామ్ లో ఫుల్ గా యాక్టివ్ గా ఉంటున్న విషయం తెలిసిందే. ఎప్పటికప్పుడు కొత్త కొత్త పిక్స్ తో పాటు తన జీవితానికి సంబంధించిన పలు విషయాలను తరచూ షేర్ చేసుకుంటుంటారు. ఆరోగ్యపరంగా ఉపయోగపడే టిప్స్ ను ఇస్తుంటారు. అందుకే ఆమె ఎప్పుడూ ట్రెండింగ్ లో ఉంటుంటారు. అయితే సమంత తండ్రి జోసెఫ్ గత నెలలో మరణించగా.. ఆమె ఆ బాధ నుంచి బయటకు వచ్చేందుకు వర్క్ లైఫ్ పై ఫుల్ గా ఫోకస్ పెట్టినట్లు క్లియర్ గా తెలుస్తోంది. ఇటీవల సిటాడెల్ హనీ బన్నీ వెబ్ సిరీస్ తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన సామ్.. తన యాక్టింగ్ తో విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు అందుకుని అబ్బురపరిచారు. ఇప్పుడు రక్త్ బ్రహ్మాండ్ ది బ్లడీ కింగ్ డమ్ అనే మరో వెబ్ సిరీస్ తో బిజీగా ఉన్నారు. ఇటీవల సెట్స్ లోకి కూడా అడుగు పెట్టారు. ఆ



సమయంలో మళ్లీ యాక్షన్ మోడ్‌లోకి వచ్చేశానంటూ పోస్ట్ పెట్టారు. అంతకుముందు కొద్ది రోజుల క్రితం.. మా ఇంటి బంగారం మూవీ అనౌన్స్ చేశారు. దీంతో ఆమె ఫుల్ బిజీగా ఉన్నట్లే! అదే సమయంలో రీసెంట్ గా ఇన్ స్టాలో ఇంట్రెస్టింగ్ పోస్ట్ పెట్టారు సమంత. 2025లో తన రాశికి ఎలా ఉంటుందోనన్న విషయంపై ఒక మెసేజ్ ను షేర్ చేశారు. వృషభ, కన్య, మకర రాశి వారు 2025లో వీటిని పొందే అవకాశం ఎక్కువగా ఉందంటూ పలు విషయాలను పాయింట్ల రూపంలో పోస్ట్ చేశారు సమంత. అవేంటంటే? ఏడాదంతా బిజీగా గడుపుతారు, వృత్తి పరంగా మెరుగు పడతారు, డబ్బులు ఎక్కువ సంపాదిస్తారు, మీరు ఆర్థికంగా బలంగా ఉంటారు, ప్రేమను పంచే భాగస్వామిని పొందుతారు, పాత లక్ష్యాలను పూర్తి చేస్తారు, ఆదాయం వచ్చే మార్గాలు పెంచుకుంటారు, మరిన్ని అవకాశాలు సొంతం చేసుకుంటారు.. అంటూ రాసుకొచ్చారు. మానసికంగాతోపాటు శారీరకంగా కూడా స్ట్రాంగ్ గా ఉంటారని, పిల్లలను పొందుతారని కూడా సామ్ ఇచ్చిన లిస్ట్ లో ఉంది. దీంతో భాగస్వామి, పిల్లలు కోసం సమంత పోస్ట్ లో ఉండడంతో నెట్టింట ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. దీంతో ఒక్కొక్కరు ఒక్కోలా స్పందిస్తున్నారు. మేడమ్.. మీకు అన్ని విధాలుగా అంతా మంచి జరగాలని కోరుకుంటున్నట్లు అభిమానులు చెబుతున్నారు.




# హై వోల్టేజ్ 'జాట్'.. రిలీజ్ డేట్ ఫిక్స్!




టాలీవుడ్ మాస్ దర్శకుడు గోపిచంద్ మలినేనికి స్టార్ హీరోలను కమర్షియల్ గా ఎలా హైలెట్ చేయాలో బాగా తెలుసు. క్రాక్ సినిమాతో బౌన్స్ బ్యాక్ అయిన ఈ దర్శకుడు బాలకృష్ణతో వీరసింహా రెడ్డి సినిమాతో మరో కమర్షియల్ హిట్ అందుకున్నాడు. ఇక ఇప్పుడు బాలీవుడ్ స్టార్ తో మరో హై వోల్టేజ్ మాస్ యాక్షన్ సినిమాతో రెడీ అవుతున్నాడు. గోపిచంద్ మలినేని దర్శకత్వంలో బాలీవుడ్ యాక్షన్ లెజెండ్ సన్నీ డియోల్ తొలిసారి కలిసి పనిచేస్తున్న సినిమా జాట్. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్లపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇప్పుడు అభిమానుల్లో భారీ అంచనాలను సృష్టిస్తోంది. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని ప్రకటిస్తూ హై వోల్టేజ్ పోస్టర్ ను రిలీజ్ చేశారు. ఈ సినిమా 2025, ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ సన్నీ డియోల్ మాస్ యాక్షన్ అవతారాన్ని మరోసారి గుర్తుచేస్తోంది. తన భుజంపై భారీ తుపాకీ, వెనుక హెలికాప్టర్, గాల్లో ఎగురుతున్న కరెన్సీ నోట్లు, స్టైలిష్ షేడ్స్ తో సన్నీ డియోల్ లుక్ ఆడియెన్స్ ని ఆకట్టుకుంటోంది. ఈ పోస్టర్ చూసిన వెంటనే ఓ వర్గం ఆడియెన్స్ లో సాలిడ్ హైప్ క్రియేట్ అవుతోంది. సన్నీ డియోల్ ఫ్యాన్స్ కోసం ఈ సినిమా భారీ యాక్షన్ ఫెస్టివల్ కానుంది. ఇటీవలి కాలంలో రిలీజ్ చేసిన టీజర్ ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంది. పుష్ప 2 తో కలిపి 12,500 స్క్రీన్‌లలో ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ టీజర్ రికార్డు స్థాయి వ్యూస్‌తో దుమ్మురేపింది. సన్నీ డియోల్ మళ్లీ తన యాక్షన్ స్టార్ ఇమేజ్‌ని గుర్తుచేస్తూ, ఈ సినిమాతో తిరిగి మరో రికార్డ్ ను అందుకోనున్నారని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సినిమాలో సన్నీ డియోల్ తో పాటు రణదీప్ హుడా, వినీత్ కుమార్ సింగ్, సయ్యామి ఖేర్, రెజీనా కసాండ్రా ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ప్రతీ పాత్రకు ఉన్న ప్రాధాన్యతతో దర్శకుడు గోపిచంద్ మలినేని మరోసారి తన స్క్రీన్ ప్లే పవర్ చూపించబోతున్నారు. జాట్ సినిమాకి థమన్ ఎస్ సంగీతం అందించగా, రిషి పంజాబీ సినిమాటోగ్రఫీ అందించారు. నవీన్ నూలి ఎడిటింగ్, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ అందించగా, యాక్షన్ కొరియోగ్రఫీ అనిల్ అరసు, రామ్-లక్ష్మణ్, వెంకట్ వంటి దిగ్గజ యాక్షన్ మాస్టర్స్ చేతుల్లో జరుగుతోంది. ఈ యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని కలిగిస్తాయని సమాచారం. మరి సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తుందో చూడాలి.

# ఈమెకు 49 ఏళ్లు అంటే నమ్ముతారా?




తెలుగు ప్రేక్షకులకు 1996లో సాహస వీరుడు సాగర కన్య సినిమాతో పరిచయం అయిన ముద్దుగుమ్మ శిల్పా శెట్టి. ఈమె ఇండస్ట్రీలో అడుగు పెట్టి 30 ఏళ్లు పూర్తి అయినా ఇప్పటికీ ఆమె అంటే ఇష్టపడే వారు ఎంతో మంది ఉంటారు. ఆమె సినిమాలు చేసినా చేయకున్నా ఒక వర్గం ప్రేక్షకులు ఆమె కదిలినా వావ్ అంటూ అభిమానం చూపిస్తూ ఉంటారు. అంతటి అభిమానులను సొంతం చేసుకున్న శిల్పా శెట్టి వయసు ప్రస్తుతం 49 ఏళ్లు. ఈ వయసులో సాధారణంగా ఆడవారు ఎక్కువ శాతం మంది పూర్తిగా ఇంటికే పరిమితం కావడం లేదంటే అందం తగ్గడంతో తెర వెనక్కి వెళ్లడం చేస్తూ ఉంటారు. శిల్పా శెట్టి మాత్రం ఈ వయసులోనే పాతికేళ్ల పడుచు అమ్మాయిలకు పోటీ ఇచ్చేంత అందంగా కనిపిస్తూ ఉన్నారు. శిల్పా నటి మాత్రమే కాకుండా యోగా ట్రైనర్‌గా కూడా వ్యవహరిస్తూ ఉంటుంది. అందుకే ఆమె ఫిజిక్ ఇప్పటికీ పాతికేళ్ల అమ్మాయి మాదిరిగానే ఉంటుంది. ఎక్కడా వయసు లక్షణాలు కనిపించవు. అంతే కాకుండా ఆమె మొహం మూడు పదుల సంవత్సరాల క్రితం ఎలా ఉందో ఇప్పుడూ అలాగే కనిపిస్తూ ఉంది. ఇప్పుడు ఇంకాస్త ఎక్కువ అందంగా శిల్పా కనిపిస్తారు అంటూ అభిమానులతో పాటు సోషల్ మీడియాలో నెటిజన్స్ అభిప్రాయం వ్యక్తం చేస్తూ ఉండటం మనం చూస్తూ ఉంటాం. రెగ్యులర్‌గా శిల్పా శెట్టి తన అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తూనే ఉంటుంది. బుల్లి తెరపై అప్పుడప్పుడు వెండి తెరపై సందడి చేస్తున్న శిల్పా శెట్టి సోషల్ మీడియాలో మాత్రం రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఈసారి జిమ్‌లో వర్కౌట్ చేస్తున్న వీడియోలను షేర్ చేసింది. ఈ అందమైన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మినీ షార్ట్ ధరించిన శిల్పా స్పోర్ట్స్ టాప్‌ను ధరించి నడుము అందం చూపిస్తోంది. సాధారణంగానే శిల్పా శెట్టి చాలా అందంగా ఉంటారు.

ఇప్పుడు ఈ ఔట్ ఫిట్‌లో చూపు తిప్పుకోనివ్వడం లేదు అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. శిల్పా శెట్టి పెళ్లి అయిన ఇన్ని సంవత్సరాల తర్వాత, ఈ వయసులోనూ ఇంత ఫిట్‌గా ఉండటం గొప్ప విషయం, ఈమె ఎంతో మందికి ఆదర్శం. ముఖ్యంగా సినిమా ఇండస్ట్రీలో ఉన్న యంగ్ హీరోయిన్స్ శిల్పా శెట్టిని ఆదర్శంగా తీసుకుని ఫిట్‌గా ఉండాలంటూ కొందరు సూచిస్తూ ఉన్నారు. ఇప్పటికీ యంగ్ హీరోలకు జోడీగా హీరోయిన్‌గా నటించేంత అందంగా శిల్పా ఉన్నారు. మరో పదేళ్లు అయినా శిల్ప అందం ఏమాత్రం తగ్గదేమో అంటూ ఆమె అభిమానులు ఆనందంగా ఈ ఫోటోలను షేర్ చేస్తూ లైక్ చేస్తున్నారు. శిల్పా ఇంతటి అందంతో ఎందుకు వరుసగా సినిమాలు చేయడం లేదని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక పై అయినా ఆమె నుంచి సినిమాలు వరుసగా రావాలని కోరుకుందాం.

# అబ్బా అనిపించే హెబ్బా క్లోజప్ క్లిక్స్

కన్నడ చిత్రం 'అద్యక్ష' తో నటనా రంగంలో అడుగు పెట్టిన హెబ్బా పటేల్ తక్కువ సమయంలోనే టాలీవుడ్‌లోనూ ఎంట్రీ ఇచ్చింది. తెలుగులో ఈమె నటించిన 'కుమారి 21ఎఫ్' సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఈతరం అమ్మాయిలకు రూపంగా హెబ్బా పటేల్ ఆ సినిమాలో కనిపించిన విషయం తెల్సిందే. హీరోయిన్‌గా తెలుగులో మొదటి సినిమానే అయినా భలే నటించింది అంటూ విమర్శకుల ప్రశంసలు దక్కించుకుంది. అలాంటి మోడ్రన్ పాత్రల్లో నటించేందుకు అమ్మాయిలు కాస్త ఇబ్బంది పడుతారు. కానీ హెబ్బా పటేల్ మాత్రం ఈజీగా నటించి మెప్పించింది. అందుకే ఆ సినిమాతో టాలీవుడ్ నుంచి మంచి ఆఫర్లు దక్కించుకుంది. హెబ్బా పటేల్ కి తెలుగులో ఆ తర్వాత చాలా ఆఫర్లు వచ్చాయి. కానీ అదృష్టం కలిసి రాలేదు. దాంతో ఆమె నటించిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశ పరుస్తూ వచ్చాయి. అయినా సినిమా ఇండస్ట్రీని వదలకుండా ప్రయత్నాలు చేస్తూనే వచ్చింది. సినిమాలు సిరీస్‌లు అంటూ చాలానే ఈ అమ్మడికి ఆఫర్లు వచ్చాయి. వచ్చిన ప్రతి ఆఫర్‌ను సద్వినియోగం



చేసుకునేందుకు అందాల ఆరబోత చేయడంతో పాటు చాలా రకాలుగా ప్రయత్నాలు చేస్తూ వచ్చింది. సోషల్ మీడియా ద్వారా ఈ అమ్మడి అందాల ఆరబోత ఫోటోలు రెగ్యులర్‌గా వైరల్ అవుతూనే ఉన్నాయి. ఇప్పుడు మరోసారి ఈమె ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. తాజాగా చీర కట్టులో ఈ అమ్మడి ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఈ అమ్మడి చీర కట్టు క్లోజప్ క్లిక్స్‌కి నెటిజన్స్ ఫిదా అవుతున్నారు. ఇంతటి అందగత్తెకు టాలీవుడ్ నుంచి సరైన ఆఫర్లు రాలేదు అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తూ ఉంటే, హెబ్బాకి కనీసం లేడీ ఓరియంటెడ్ సినిమాల్లో మరిన్ని ఆఫర్లు వచ్చి ఉండాల్సింది అంటున్నారు. కొన్ని సినిమాల్లో నటనతో హెబ్బా వావ్ అనిపించింది. అందంతోనూ అబ్బా అనిపించింది. అలాంటి హెబ్బా పటేల్ కి కాలం కలిసి రాలేదు, సినిమాల్లో ఇకపై అయినా మరిన్ని ఆఫర్లు దక్కించుకుంటుందేమో చూడాలి అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. తెలుగులో ఈమె ఈడో రకం ఆడో రకం, ఎక్కడికి పోతావు చిన్నవాడా, అంధగాడు, 24 కిస్సెస్ తో పాటు ఇంకా పలు సినిమాల్లో నటించింది. ఇతర భాషల్లోనూ ఈమె నటించడం ద్వారా గుర్తింపు లభించింది. ప్రస్తుతం తెలుగులో పెద్దగా సినిమాలు చేయడం లేదు, కానీ కోలీవుడ్ లో మాత్రం ఈ అమ్మడు నటించిన మూడు సినిమాలు విడుదలకు సిద్దం అవుతున్నాయి. అక్కడ మూడు సినిమాల్లో ఒకటి రెండు హిట్ అయినా కచ్చితంగా మరిన్ని సినిమా ఆఫర్లు అక్కడ దక్కే అవకాశాలు ఉన్నాయి. పైగా తమిళ ప్రేక్షకులను మెప్పించే విధంగా ఇలాంటి అందమైన చీర కట్టు ఫోటోల్లో కనిపిస్తే మరిన్ని ఆఫర్లు రావడం ఖాయం.

# చీరలో సంయుక్త గ్లామర్ ఘాటు

సంయుక్తా తన తాజా గ్లామర్ లుక్ తో సోషల్ మీడియా ప్రపంచాన్ని మరోసారి ఉపేస్తోంది. ఈ ఫోటోల్లో ఆమె ధరించిన పసుపు, పింక్ కలర్ కాంబినేషన్ చీర ఆమె అందాన్ని మరింత హైలెట్ చేస్తూ కనిపిస్తోంది. చెవిపోగులు, మెడలో పూసలహారం, అలాగే కంచు బ్రాస్‌లెట్ లాంటి ఆభరణాలతో ఆమె లుక్ మరింత ఆకర్షణీయంగా మారింది. సంయుక్తా తన ఈ లుక్ కోసం చాలా శ్రద్ధ తీసుకున్నట్లు కనిపిస్తోంది, ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.సంయుక్త ఎలా కనిపించినా అందంగానే ఉంటుందని మరోసారి నిరూపించింది. ఫ్యాషన్ డ్రెస్సులలోనే కాకుండా చీరలో కూడా తన వయ్యారంతో మైమరిపిస్తోంది. ఇక సంయుక్తా కెరీర్ విషయానికి వస్తే, ఆమె తన ఫిల్మ్ ఇండస్ట్రీ ప్రయాణాన్ని మలయాళ చిత్రాల ద్వారా ప్రారంభించి, తెలుగు, తమిళ భాషల్లో కూడా మంచి గుర్తింపు తెచ్చుకుంది. తెలుగులో ఈమధ్య ఆమె చేసిన సినిమాలు



బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకున్నాయి. ఆమె ప్రస్తుతం స్వయంభు అనే సినిమాలో నటిస్తోంది, నిఖిల్ సిద్దార్థ్ హీరోగా వస్తున్న ఈ చిత్రం పై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ పీరియాడిక్ ఫిల్మ్ ద్వారా సంయుక్తా తన నటనతో అభిమానులను ఆకట్టుకోబోతుందని పోస్టర్స్ చూస్తే అర్థమవుతోంది. ఇక సంయుక్తా తన ఫోటోషూట్ల ద్వారా అభిమానులతో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉంటోంది. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఆమె షేర్ చేసిన ఈ ఫోటోలు ఆమెను మరింత దగ్గరగా కలిపేలా చేస్తున్నాయి.ఒకవైపు ఆమె ట్రెండిషనల్ లుక్స్‌తో అభిమానులను ఆకర్షిస్తుంటే, మరోవైపు గ్లామర్ లుక్స్ లో కూడా ఆమె తన ప్రత్యేకతను చూపిస్తుంది. ఇక రాబోయే ప్రాజెక్ట్‌ల విషయానికి వస్తే, సంయుక్తా ప్రముఖ హీరోలతో కలిసి పలు సినిమాలు చేస్తోంది. ప్రస్తుతం ఆమె నటిస్తున్న మరో కీలక చిత్రం రామ్, మోహన్ లాల్ సరసన ఒక కీలక పాత్రలో కనిపించబోతోంది. ఈ సినిమా మలయాళంలోనే కాకుండా ఇతర భాషల్లో కూడా విడుదల కానుంది. అదేవిధంగా, శర్వానంద్, బెల్లంకొండ శ్రీనివాస్ నెక్స్ట్ సినిమాలలో కూడా ఆమె మెయిన్ హీరోయిన్ గా అవకాశం అందుకుంది.



## మరికొన్ని గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు.. రైతు భరోసా పథకానికి కావాల్సింది ఇవే..

హైదరాబాద్, జనవరి 24: రైతు భరోసా పథకాన్ని అమలు చేయడానికి సంబంధించిన మార్గదర్శకాలను తెలంగాణ ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. గతంలో ఈ పథకం అమలులో జరిగిన లోటు పాట్లను ప్రస్తుతం ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో ఈ పథకం పక్కా పకడ్బందీగా అమలు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. అందులోభాగంగా.. జనవరి 26వ తేదీన గణతంత్ర దినోత్సవం సందర్భంగా రైతు భరోసా నిధులను విడుదల చేసేందుకు ముహుర్తం ఖారారు చేసింది. వ్యవసాయ యోగ్యమైన భూములకు ఎకరానికి రూ. 6000 చొప్పున పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమ చేయనుంది. వ్యవసాయ శాఖ అందించిన తాజా గణాంకాల ప్రకారం.. వర్షాకాలంలో 1.49 కోట్ల ఎకరాలల్లో పంట సాగు అయినట్లు ప్రభుత్వానికి నివేదిక అందింది. ఇక దాదాపు 3 లక్షల ఎకరాలకుపైగా భూములు సాగు యోగ్యం కాదని తేల్చి.. వాటి సర్వే నెంబర్లను సైతం ప్రభుత్వం బ్లాక్ చేసింది. ఇక రైతు భరోసా అమలుకు రూ.8900 కోట్లు నిధులు అవసరమవుతాయని ఇప్పటికే ప్రభుత్వానికి ఆర్థిక శాఖ నివేదిక అందించింది. ఈ రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని అర్హులైన రైతులకు వ్యవసాయ శాఖ సూచించింది. అందుకోసం అవసరమైన పత్రాలు సిద్ధం చేసుకోవాలంది. 2025, జనవరి 01వ తేదీ తర్వాత కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన వారు సైతం దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొంది. దరఖాస్తుదారుడి పట్టాదారు పాస్ పుస్తకం లేదా డిజిటల్ సంతకం చేసిన జిరాక్స్ కాపీ, ఆధార్ కార్డ్ జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ ఖాతా జిరాక్స్, పూర్తిగా నింపబడిన దరఖాస్తు ఫారాన్ని క్లస్టర్ అధికారి అయిన వ్యవసాయ విస్తరణ అధికారికి సమర్పించాల్సి సూచించింది. అయితే గతంలో పెట్టుబడి సహయం వచ్చిన రైతుల బ్యాంకు అకౌంట్ నెంబర్ ఏమైనా మార్పులుంటే.. కొత్త బ్యాంక్ అకౌంట్ నెంబర్ ఖాతాకు సంబంధించిన జిరాక్స్ కాపీని.. దరఖాస్తు ఫారమ్‌కు జత చేసి సమర్పించాల్సి ఉంటుంది. 2025, జనవరి 01 నాటికి భూ భారతి (ధరణి) పోర్టల్‌లో ఉన్న పట్టాదారుల డేటా.. రైతు భరోసా పథకం కింద అర్హులైన రైతులకు సాయం అందించేందుకు భూమి పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) నుంచి పొందబడినదని.. డిజిటల్ సంతకం అయిన రైతులు ఈ పథకానికి అర్హులని వ్యవసాయ శాఖ స్పష్టం చేసింది. అయితే గతంలో రైతు బంధు పొందిన రైతులు మళ్లీ దరఖాస్తు చేసుకోనవసరం లేదని వివరించింది.




## కేసీఆర్, కేటీఆర్‌లకు కొరియర్‌లో ఈనో ప్యాకెట్లు

హైదరాబాద్, జనవరి 24: తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా సాగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనపై ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ అగ్ర నేతల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. అలాంటి వేళ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ స్పందించారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమాశంలో ఆయన మాట్లాడుతూ.. గేమ్ చేంజర్‌లాగా రైజింగ్ తెలంగాణ కోసం రాష్ట్రానికి సీఎం రేవంత్ రెడ్డి బృందం పెట్టుబడులు తీసుకు వచ్చారని తెలిపారు. తాము అభివృద్ధి చేస్తుంటే బీఆర్ఎస్ వాళ్లు తట్టుకోలేక పోతున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆ పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు ఈనో ప్యాకెట్లు కొరియర్ చేసినట్లు చెప్పారు. బీఆర్ఎస్ నేతల కడుపు మంట తగ్గడం కోసం.. వారికి ఈనో ప్యాకెట్లు పంపిస్తున్నామని వివరించారు. బీఆర్ఎస్ వాళ్ళకి జీర్ణించుకునే తత్వం పెరగడం కోసం ఒక క్యాంపెయిన్ స్టార్ట్ చేస్తున్నామని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ స్పష్టం చేశారు. అలాగే కేసీఆర్, కేటీఆర్ కడుపు మంట తగ్గడం కోసం ఈనో ప్యాకెట్లను కొరియర్ చేస్తున్నానన్నారు. బీఆర్ఎస్ నేతలకు ఈనో ప్యాకెట్లు పంపాలంటూ ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ పిలుపు నిచ్చారు. రాష్ట్రంలోని అభివృద్ధి తట్టుకోలేక పోతున్న వారు.. ఈ ఈనోతో జీర్ణించుకొంటారని ఆయన వ్యంగ్యంగా అన్నారు. రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే గుడ్డలు ఊడదీసి కొడతామంటూ బీఆర్ఎస్ నేతలను ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ హెచ్చరించారు. యూరప్‌లోని దావోస్ వేదికగా ప్రపంచ ఆర్థిక సదస్సు జరిగింది. ఈ సదస్సులో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి.. రూ. లక్షల కోట్ల పెట్టుబడులను తెలంగాణకు తీసుకు వచ్చారు. ఈ పర్యటన ముగించుకొని ఆయన హైదరాబాద్ సైతం చేరుకొన్నారు. అయితే రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనపై బీఆర్ఎస్ అగ్రనేతలు వ్యంగ్య బాణాలు సంధిస్తున్నారు. తెలంగాణకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త మెగా కృష్ణారెడ్డి.. సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని ఎదురు బదురు ఇళ్లలోనే నివసిస్తారని గుర్తు చేశారు. అలాంటిది వీరిద్దరు.. రాష్ట్రంలో పెట్టుబడుల కోసం దావోస్ వెళ్లాలా అంటూ బీఆర్ఎస్ అగ్రనేతల్లో ఒకరైన హరీష్ రావు వ్యంగ్యంగా ప్రశ్నించారు. అంతేకాదు.. రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనకు నగదు వృథా అంటూ చరకలు వేశారు. అలాగే రేవంత్ రెడ్డి ఈ పర్యటనపై బీఆర్ఎస్ నేతల తమదైన శైలిలో స్పందిస్తున్నారు. అలాంటి వేళ.. కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ బీఆర్ఎస్ నేతల్లో కడుపు మంట పెరిగిపోయిందని.. దీనిని తగ్గించడానికి ఈనో ప్యాకెట్లు పంపాలని నిర్ణయించారు.




హైదరాబాద్: ఏపీ ప్రభుత్వం చేపట్టిన బనకచర్ల ప్రాజెక్టు విషయంలో చాలా అప్రమత్తంగా ఉన్నామని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. బనకచర్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "భారాస హయాంలో నదీ జలాల విషయంలో చాలా నష్టం జరిగింది. మేం అధికారంలోకి వచ్చాక నష్టం తగ్గించే ప్రయత్నం చేస్తున్నాం. భారాస పొరపాట్లను సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నాం. బనకచర్ల విషయంలో అభ్యంతరాలు తెలుపుతూ ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్‌కి లేఖ రాశాం. ఏపీ పునర్విభజన చట్టానికి ఇది విరుద్ధం, ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయించవద్దని విజ్ఞప్తి చేశాం" అని ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు.

## దావోస్ దారి ఖర్చులు వృధా చేసిన సీఎం రేవంత్



హైదరాబాద్, జనవరి 24: మెగా కృష్ణారెడ్డి కంపెనీతో ఒప్పందానికి దావోస్ వెళ్లాలా? అంటూ సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు చురకలంటించారు. జూబ్లీహిల్స్‌లో రోడ్డుకు అటు వైపు సీఎం రేవంత్ రెడ్డి ఉంటారని.. ఇటు వైపు మెగా కృష్ణారెడ్డి ఉంటారని వివరించారు. దావోస్ టూర్‌కు సీఎం రేవంత్ రెడ్డి దారి ఖర్చులు వృధా చేశారని మండిపడ్డారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే హరీష్ రావు విలేకర్లతో మాట్లాడుతూ.. గోదావరి జలాల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే.. రేవంత్ సర్కార్ మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందంటూ నిప్పులు చెరిగారు. ఏపీని ఆపడం చేతకాకుంటే.. అఖిల పక్షాన్ని తీసుకు వెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డికి హరీష్ రావు సూచించారు. ఈ వ్యవహారంలో సీఎం రేవంత్ రెడ్డి.. గురుదక్షిణ చెల్లించుకొంటున్నట్లు అనుమానం కలుగుతోందని హరీష్ రావు అభిప్రాయపడ్డారు. బనకచర్ల ద్వారా 200 టీఎంసీలను ఆంధ్రప్రదేశ్‌కు తరలించుకు పోతుంటే.. రేవంత్ రెడ్డి మౌనంగా ఉండడం వెనుక కారణం ఏమిటని ఆయన సూటిగా ప్రశ్నించారు. ప్రాజెక్ట్ నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని కేంద్రానికి ఏపీ సీఎం చంద్రబాబు ఉత్తరాలు రాస్తున్నారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు.. గోదావరి జలాలు తరలించుకుపోతుంటే.. సీఎం రేవంత్ రెడ్డి మాత్రం దావోస్, ఢిల్లీ యాత్రల్లో బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. గోదావరి నీటిని ఆంధ్రప్రదేశ్, తుంగభద్ర నీళ్లను కర్ణాటక తరలించుకుపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అపెక్స్ కౌన్సిల్ అనుమతి లేకుండా నీటిని తరలించుకు పోతుంటే సీఎం రేవంత్ రెడ్డితోపాటు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎందుకు స్పందించరంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. నీటిపారుదల శాఖ మంత్రిగా ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫెయిల్ అయ్యారని విమర్శించారు. ఉత్తమ్‌కు చేతనైతే.. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలని మాజీ మంత్రి హరీష్ రావు సూచించారు. 200 టీఎంసీల గోదావరి నీటిని పెన్నా బేసిన్‌కు తీసుకు వెళ్లడానికి ఆంధ్రప్రదేశ్ యుద్ధ ప్రాతిపదికన ప్రణాళికలు రచిస్తోందని ఆరోపించారు. హక్కుగా రావాల్సిన నీటిని సైతం 13 నెలలుగా తెలంగాణ ప్రభుత్వం సాధించ లేకపోయిందంటూ ఎద్దేవా చేశారు. ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు నుంచి రూ. 40 వేల కోట్లు ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పిస్తామని నిర్మలా సీతారామన్ హామీ ఇచ్చారని ఈ సందర్భంగా హరీష్ రావు గుర్తు చేశారు. తుంగభద్ర నుంచి నీళ్లు రాకుండా కర్ణాటక అడ్డుకుంటోన్న సీఎం రేవంత్ రెడ్డి మాత్రం స్పందించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రయోజనాలు గండి కొట్టిన ఆదిత్యానాథ్ దాస్‌ను రాష్ట్ర ఇరిగేషన్ శాఖ సలహాదారుగా పెట్టుకోవడం దారుణమైన విషయమని హరీష్ రావు ఈ సందర్భంగా పేర్కొన్నారు. తెలంగాణకు అన్యాయం చేసినందుకు గతంలో ఇదే ఆదిత్యానాథ్ దాస్‌కు మూడు నెలల జైలు శిక్ష పడిందని మాజీ మంత్రి హరీష్ రావు గుర్తు చేశారు.

## కేంద్రమంత్రి బండి సంజయ్ ఆసక్తికర వ్యాఖ్యలు



కరీంనగర్ : కేంద్రమంత్రి బండిసంజయ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో తనకు ఎలాంటి విభేధాలు లేవని అన్నారు. గంగుల కమలాకర్‌తోనే కొద్దిగా గ్యాప్ ఉందని త్వరలో అదికూడా సెట్ అయిపోతుందన్నారు. శుక్రవారం నాడు కరీంనగర్‌లో కేంద్రమంత్రి మనోహర్ లాల్ కట్టర్‌తో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన సభలో కేంద్రమంత్రి మాట్లాడుతూ.. కరీంనగర్‌ను అభివృద్ధి చేయడమే తనకు తెలుసన్నారు. జిల్లా అభివృద్ధి కోసం రాజకీయాలలకు అతీతంగా కలిసి పనిచేయాలని కోరుతున్నామన్నారు. కరీంనగర్ అభివృద్ధి కోసం కంకణం కట్టుకున్నానన్నారు. కరీంనగర్‌లో నాలుగు వేల ఇండ్లకు నిరంతరాయంగా 24 గంటల పాటు నీళ్లు సరఫరాల అవుతాయన్నారు. పేదరికం నుంచి హర్యానా సీఎంగా, కేంద్రమంత్రిగా ఎదిగిన మనోహర్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరగడం ఎంతో గర్వకారణమన్నారు. కరీంనగర్‌లో డంప్ యార్డ్‌తో ప్రజలు అల్లాడిపోతున్నారని.. డంపింగ్ యార్డు సమస్య నుంచి కరీంనగర్ ప్రజలకు విముక్తి కల్పిస్తామన్నారు. స్మార్ట్ సిటీ నిధులను దారి మళ్లిస్తే కొట్లాడి సాధించినట్లు తెలిపారు. వేములవాడ రాజన్న ఆలయాన్ని ప్రసాదం స్కీంలో చేరుస్తున్నామని తెలిపారు. అలాగే కొండగట్టు, ఇల్లందకుంట ఆలయాలను రామాయణ్ సర్క్యూట్‌లో చేరుస్తామన్నారు. సిరిసిల్ల, వంగర ప్రాంతాల్లో నవోదయ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో ఈఎస్ఐ ఆస్పత్రిని కూడా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం 10 ఏళ్లలో తెలంగాణకు 12 లక్షల కోట్లు ఖర్చు చేసిందని, రోడ్ల కోసమే లక్షన్నర కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని, రాష్ట్రంలోని 32 జిల్లాల్లో జాతీయ రహదారులను అభివృద్ధి చేశామని బండి సంజయ్ వెల్లడించారు.

**తెలంగాణకే ఎక్కువ ఇండ్లు: కేంద్రమంత్రి :** "ఈ ఏడాది దేశవ్యాప్తంగా కోటి ఇండ్లను నిర్మించబోతున్నాం. తెలంగాణకు రావాల్సిన వాటా కంటే ఎక్కువ ఇండ్లను మంజూరు చేస్తాం. కరీంనగర్ డంప్ యార్డ్‌ను ఎత్తేస్తాం. అందుకు అవసరమైన నిధులన్నీ కేంద్రమే మంజూరు చేస్తుంది. విద్యుత్ విషయంలోనూ తెలంగాణకు సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నా" అని కేంద్రమంత్రి మనోహర్ లాల్ కట్టర్ స్పష్టం చేశారు. కాగా.. జిల్లాలో పలు అభివృద్ధి పనులకు కేంద్రమంత్రి మనోహర్ లాల్ కట్టర్ ఈరోజు శంకుస్థాపనలు, ప్రారంభాలు చేశారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో కరీంనగర్‌కు చేరుకున్న కేంద్రమంత్రి బండి సంజయ్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్రమంత్రి శంకుస్థాపనలు చేశారుకరీంనగర్ లో 24 గంటల తాగునీరు, మల్టీ పర్పస్ పార్క్‌ను కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ కట్టర్, బండి సంజయ్ కుమార్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం హౌజింగ్ బోర్డు కాలనీలో జరిగే బహిరంగ సభలో కేంద్రమంత్రి పాల్గొని ప్రసంగించారు.

## సంచలన విషయాలు బయటపెట్టిన ఎల్ అండ్ టీ..




హైదరాబాద్, జనవరి 24: కాళేశ్వరం ప్రాజెక్టులో లోపాలపై కమిషన్ శుక్రవారం చేపట్టిన విచారణ ముగిసింది. విచారణకు హాజరైన ఎల్ అండ్ టీ ప్రతినిధులు కీలక విషయాలను వెల్లడించారు. ఎల్ అండ్ టీ ప్రాజెక్టు డైరెక్టర్ రామకృష్ణ రాజు, వైస్ చైర్మన్ సురేష్, రజినీష్.. కాళేశ్వరం కమిషన్ ఎదుట విచారణకు హాజరయ్యారు. ప్రాజెక్టు నిర్మాణం, నాణ్యత, బ్లాక్ సెవెన్ కుంగుబాటుపై కమిషన్ వరుస ప్రశ్నలు సంధించగా.. ఎల్ అండ్ టీ ప్రతినిధులు కీలక విషయాలను బహిర్గతం చేశారు. నిర్మాణంలో నాణ్యత పాటించారా అని కమిషన్ ప్రశ్నించగా.. వంద శాతం క్వాలిటీ నిర్మాణం చేశామని ఎల్ అండ్ టి ప్రతినిధులు సమాధానమిచ్చారు. నీటిపారుదల శాఖ ఇచ్చిన డిజైన్స్, డ్రాయింగ్స్ ప్రకారమే మేడిగడ్డ ఆనకట్ట నిర్మించామన్నారు. డిజైన్‌లో అంచనా వేసిన ప్రవాహ వేగం కంటే ఎక్కువగా ఉన్నందునే ఆనకట్ట దిగువన అప్రాన్, సీసీ బ్లాకులు దెబ్బతిన్నాయని ప్రతినిధులు తెలిపారు. ఈ కారణంగానే ప్రాజెక్టు బ్లాకులు కుంగినట్లు అభిప్రాయం వ్యక్తం చేశారు. నీరు నిల్వ చేసిన మొదటి సీజన్ తరువాతే మేడిగడ్డ ఆనకట్టలో సమస్యలు తలెత్తాయని ఎల్ అండ్ టీ ప్రతినిధులు.. కమిషన్‌కు తెలిపారు. సమస్యలు పరిష్కరించేందుకు తగిన డిజైన్స్ ఇవ్వాలని నీటిపారుదల శాఖను కోరామన్నారు. నాలుగేళ్లు అయినా నీటిపారుదల శాఖ నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నారు. 2019 లోనే లోపాలను పరిష్కరించి ఉంటే మేడిగడ్డ ఆనకట్టకు ఇంత ప్రమాదం వాటిల్లేది కాదని ఎల్ అండ్ ప్రతినిధులు చెప్పారు. ప్రారంభం నుంచి కుంగే వరకు ఆనకట్ట ఎప్పుడూ ఖాళీగా లేదని పేర్కొన్నారు. సమస్యలు కొనసాగుతూనే వచ్చి ఆ ప్రభావం ఏడో బ్లాక్‌పై పడి ఉండవచ్చన్న ఎల్ అండ్ టి ప్రతినిధులు చెప్పారు. ఇక మేడిగడ్డ ఆనకట్ట నిర్మాణంలో ఎలాంటి సబ్ కాంట్రాక్టులు ఇవ్వలేదని ఎల్ అండ్ టీ ప్రతినిధులు.. కాళేశ్వరం కమిషన్‌కు తెలిపారు. కాఫర్ డ్యామ్‌కి సంబంధించి ఎలాంటి అనదపు డబ్బులు ప్రభుత్వం చెల్లించలేదన్నారు. ఆనకట్ట పూర్తి అయినట్లు ధృవీకరణ పత్రం కూడా ఇచ్చారని.. డిఫెక్ట్ లయబిలిటీ గడువు కూడా పూర్తి అయ్యిందని ఎల్ అండ్ టీ ప్రతినిధులు తెలిపారు. అయితే, కుంగిన బ్లాక్‌ను రిపేర్ చేయొచ్చా అని కమిషన్ ప్రశ్నించగా.. విభిన్న సమాధానాలు చెప్పారు ఎల్ అండ్ టి ప్రతినిధులు.



## మారుతున్న కరీంనగర్ రాజకీయం.. భాజపాలోకి కరీంనగర్ మేయర్?

కరీంనగర్: కరీంనగర్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల వేళ రాజకీయం మారుతోంది. కేంద్రమంత్రి ఖట్టర్ పర్యటనవేళ సరి కొత్త సమీకరణలు చోటు చేసుకుంటున్నాయి. కరీంనగర్ మేయర్ సునీల్‌రావు, 10 మంది కార్పొరేటర్లు.. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో భాజపాలో చేరే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. మరో రెండు రోజుల్లో పార్టీ మార్పుపై స్పష్టత వచ్చే అవకాశముందని సమాచారం.

## తెలంగాణ సీఐడీ చేతికి 'కిడ్నీ రాకెట్' కేసు.. వైద్యారోగ్య శాఖ మంత్రి ఆదేశాలు

హైదరాబాద్: నగరంలోని అలకనంద ఆస్పత్రిలో వెలుగు చూసిన 'కిడ్నీ రాకెట్' కేసును రాష్ట్ర ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు. ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని మంత్రి ఆదేశించారు. మరోవైపు ఈ కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ఈ వ్యవహారంలో ఆస్పత్రి ఛైర్మన్ సుమంత్, మరో వ్యక్తి గోపి సహా 8 మందిని పోలీసులు అరెస్టు చేశారు. సుమంత్, గోపీని పోలీసులు న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. గతంలో కిడ్నీ రాకెట్ కేసులో మంగళవారం సాయంత్రం ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతడి ద్వారా కొందరి పేర్లు, ఫోన్ నంబర్లు సేకరించారు. వీరంతా తమిళనాడు, కర్ణాటక నుంచి కిడ్నీ దాతలు, గ్రహీతల్ని తీసుకురావడంలో కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. అలకనంద ఆసుపత్రిలో కిడ్నీమార్పిడి శస్త్ర చికిత్సలు గతంలోనూ జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించినట్లు సమాచారం. కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సకు కనీసం 15 నుంచి 20 మంది వైద్యులు, ఇతర సిబ్బంది అవసరమవుతారు.

చికిత్స చేయడానికి వైద్యులతోపాటు ఆపరేషన్‌కు ముందు, తర్వాత ఐసీయూ, ఆపరేషన్ థియేటర్‌లో నర్సులు, టెక్నీషియన్లు ఉండాలి. ఇంతమంది ఎక్కడి నుంచి వస్తున్నారనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. ఈ ఆసుపత్రి 9 పడకలతో ప్రారంభమైందని, ఇందులో ఎలాంటి ప్రత్యేక వసతులు లేవని రంగారెడ్డి జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక ఇచ్చారు.

## దావోస్‌లో రద్దీగా తెలంగాణ పెవిలియన్: మహేశ్‌కుమార్ గౌడ్



హైదరాబాద్: భారాస గత పదేళ్లలో రాష్ట్రానికి చేసిందేమీ లేదని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. భారాస ప్రభుత్వం తెచ్చిన పెట్టుబడులూ పెద్దగా ఏమీ లేవని చెప్పారు. ప్రతిపక్షాలు ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "దావోస్‌లో ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్లడం వల్లే పెట్టుబడిదారులకు నమ్మకం కుదిరింది. తెలంగాణ పెవిలియన్ రద్దీగా మారింది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక సంస్థలు ముందుకొచ్చాయి. మమ్మల్ని విమర్శించే ప్రతిపక్షాలు ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలి.

ప్రజలను మభ్యపెట్టడం.. ఆచరణ సాధ్యంకాని హామీలివ్వడమే భారాస పని. గత ప్రభుత్వ పాలనతో నెలకు రూ.ఆరున్నర వేల కోట్ల వడ్డీ కడుతున్నాం. మంచి పనులు జరుగుతున్నప్పుడు ప్రశంసించడం నేర్చుకోండి. తాజాగా రాష్ట్రానికి రానున్న పెట్టుబడులతో 50వేల నుంచి 75 వేల ఉద్యోగాలు లభించే అవకాశముంది" అని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com